జలకళ.. వెలవెలా..!

నవరత్నాలు.. వైసీపీ హామీల ప్యాకేజీకి ఇదొక బ్రాండెడ్ పేరు. ఇంత ముఖ్యమైన హామీల్లో భాగమైన జలకళ పథకం అటకెక్కింది. కనీసం పది శాతం మందికి కూడా లబ్ధి చేకూర్చకుండా వెలవెలబోయింది. ఒక దశలో దీని అమలు కోసం పార్లమెంటు నియోజకవర్గానికి ఒకటి వంతున బోరు బండి కొనాలని నిర్ణయించారు. దీనిపై చివరివరకు కసరత్తు జరిగి టెండర్ల వరకూ వచ్చి ప్రభుత్వం వెనక్కు తగ్గింది. కాంట్రాక్టర్లకు తవ్వకాలు అప్పజెప్పి వారి బోరు బండ్లకు వైసీపీ రంగులు వేయాలనే నిబంధన కూడా పెట్టారు. కాగా జలకళ పథకంలో ఉచిత బోర్ల కోసం దరఖాస్తులు వేలల్లో ఉండగా కనీసం 10 శాతం బోర్లు కూడా తవ్వలేకపోయారు. ప్రభుత్వమే చివరికి దీనిని అటకెక్కించిందన్న విమర్శలున్నాయి.



- కరువు రైతును ఊరించి ఉస్సూరనిపించిన ప్రభుత్వం
- దరఖాస్తులు వేలల్లో.. తవ్వింది వందల్లో
- గిట్టుబాటు లేక.. బిల్లులు రాక ముందుకు రాని బోరు బండి కాంట్రాక్టర్లు
- అధికారుల చుట్టూ తిరిగి ఆశలు వదులుకున్న పేద రైతులు
- నీరుగారిన నవరత్నాల్లోని జలకళ పథకం

కలికిరి, ఫిబ్రవరి 21: వైసీపీ ప్రభుత్వం నవరత్నాల్లో భాగంగా జలకళ పేరుతో అమలు చేసిన ఉచిత బోర్ల తవ్వకం పథకం నీరుగారిందన్న విమర్శలున్నాయి. పేద రైతుల నుంచి దరఖాస్తులు సేకరించి వారి పొలాల్లో ఉచితంగా బోర్లు వేయించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పథకాన్ని చేపట్టింది. 2020 జూలై 3న మార్గదర్శకాలు జారీ చేసింది. దీని ప్రకారం జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ఆధ్వర్యంలో జలకళను అమలు చేసేందుకు ఆదేశాలిచ్చింది. అవసరమైన రైతులు స్థానిక సచివాలయాల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు పంపుకోవాలని ప్రభుత్వం సూచించింది. ఎలాంటి బోర్లు, బావులు లేని ఐదెకరాల లోగా ఉన్న రైతులు అర్హులని, బోర్ల తవ్వకాల కోసం పార్లమెంటు నియోజకవర్గానికి ఒక కాంట్రాక్టరు చొప్పున ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సమాయత్తమైంది. ప్రభుత్వ ప్రకటనను చూసి వేలాది మంది రైతులు దరఖాస్తులు చేసుకున్నారు. ఇదిలా ఉండగానే 2020 అక్టోబరు 19న మునుపటి మార్గదర్శకాలను సవరిస్తూ ప్రభుత్వం తాజాగా ఆదేశాలు జారీ చేసింది. దీనిప్రకారం జలకళ కింద తవ్విన బావులకు ఉచితంగా మోటార్లు బిగించాలని ప్రభుత్వం ఆదేశించింది.

కొన్ని గ్రామాలకు వర్తించని జలకళ పథకం

ఇదిలా వుండగా వైసీపీ ప్రభుత్వంలో 2020 నాటికి వర్షాభావ పరిస్థితులు తీవ్ర రూపం దాల్చాయి. అంతకు ముందే గ్రామాల్లో తాగునీటికి కూడా జనం కటకటలాడుతుండగా కనీసం తినడానికి పంటలు పండించుకొనే పరిస్థితులు కూడా లేవు. సాగునీటి బోర్లు పూర్తిగా ఎండిపోయాయి. రైతులు పంటలు పెట్టలేని పరిస్థితి. ఈ సమయంలోనే ప్రభుత్వం 2020 ఫిబ్రవరి 27న రాష్ట్రంలో భూగర్భ జలాలు దారుణంగా అడుగంటిన 1094 గ్రామాలను గుర్తిస్తూ జీవో 548 జారీ చేసింది. దీని ప్రకారం ఈ గ్రామాల్లో కొత్తగా బోర్లు వేయడానికి గానీ, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయడాన్ని గానీ పూర్తిగా నిషేధించారు. అప్పటి ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 197 గ్రామాలు, కడప జిల్లాలో 244 గ్రామాలను నిషేధిత జాబితాలో ఉంచారు. దీని ప్రకారం ఈ గ్రామాలన్నీ జలకళ పథకానికి దూరమయ్యాయి. ఇక మిగిలిన నిషేధం లేని గ్రామాల రైతులు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హత పొందారు.

కఠిన నిబంధనలతో

జలకళకు దూరమైన రైతులు

భూగర్భ జలాలు అడుగంటిన గ్రామాలుగా ప్రస్తుత అన్నమయ్య జిల్లాలో కలికిరి మండలంలోని గుట్టపాళెం, రామసముద్రంలో 9 గ్రామాలు, చిన్నమండెంలో 4, గాలివీడులో 3, రైల్వేకోడూరులో 9, లక్కిరెడ్డిపల్లెలో 4, ఓబులవారిపల్లెలో 10, పెనగలూరులో 17, పుల్లంపేటలో 18, రాజంపేటలో 17, రామాపురంలో 2, రాయచోటిలో 8, సంబేపల్లెలో 4, సుండుపల్లెలోని ముదుంపాడు, వీరబల్లిలో 6, ఒంటిమిట్టలో 3 వంతున మొత్తం 116 గ్రామాలను నిషేధిత జాబితాలో ఉంచారు. దీంతో జిల్లాలోని ఈ గ్రామాలన్నీ జలకళ పథకానికి దూరమయ్యాయి. ఇక ఐదెకరాలు లోపు ఉన్న రైతులు మాత్రమే అర్హులుగా ప్రకటించడంతో ఐదెకరాలకు కొద్దిగా పైబడిన రైతులు కూడా అర్హత కోల్పోయారు. అందులోను కనీసం ఎండిపోయిన బోరు, పాడుబడ్డ బావులున్నా కూడా అనర్హులుగానే తేల్చారు. ఇక ఐదెకరాల లోగా పొలం వున్నా అందులో కనీసం రెండున్నర ఎకరాలు ఒకేచోట ఉండాలన్న నిబంధన కూడా పలువురు అర్హులైన రైతులకు అడ్డంకిగా నిలిచింది. దరఖాస్తు చేసుకున్న రైతు పొలంలో బోరుగానీ, బావిగానీ లేదని ధృవీకరించాల్సిన బాధ్యతను వీఆర్వోలకు అప్పగించారు. ఇక్కడా చాలా మంది పేర్లు తారుమారయ్యాయనే ఆరోపణలున్నాయి.

వేలల్లో దరఖాస్తులు.. వందల్లో బోర్లు

వేలల్లో దరఖాస్తులు రావడం వాటిని వడపోసి లబ్ధిదారులైన రైతులను ఎంపిక చేసే ప్రక్రియ మొత్తం స్థానిక వైసీపీ నాయకులే చేశారని, దీంతో అధికార పార్టీకి చెందిన వారికే పథకం పరిమితమైందన్న విమర్శలు కూడా ఉన్నాయి. ఈ పథకం అమలు ప్రారంభమైన అనంతరం అంతకు ముందున్న గరిష్ఠ భూమిని 5 నుంచి 10 ఎకరాలకు పెంచడం కూడా ఈ విమర్శలకు అవకాశం కల్పించినట్లయింది. మొత్తం మీద జిల్లాలోని కలికిరి క్లస్టర్‌లోని మండలాల నుంచి 1626 దరఖాస్తులు, తంబళ్లపల్లె క్లస్టర్‌లో 2069, లక్కిరెడ్డిపల్లె క్లస్టర్ నుంచి 2148, రాజంపేట క్లస్టర్ నుంచి 322, రాయచోటి నుంచి 1645 వంతున మొత్తం జిల్లా నుంచి 7810 దరఖాస్తులు బోరుబావుల కోసం అందాయి. ఇన్ని వేల దరఖాస్తులకు గానూ వివిధ రకాల వడపోతల అనంతరం కేవలం 940 బోరు పాయింట్లను మాత్రం గుర్తించారు. ఇంకా 5519 చోట్ల సర్వే పనులు చేపట్టకుండా పెండింగ్‌లో పడ్డాయి. మొత్తం మీద సర్వే రిపోర్టుల ప్రకారం కేవలం 3 దరఖాస్తులు మాత్రం తిరస్కరించారు. ఇన్ని వేల సంఖ్యలో దరఖాస్తు చేసుకున్న రైతులు మాత్రం ఇప్పటికీ బోరు తవ్వుతారనే ఆశతోనే ఎదురు చూస్తున్నారు.

కలికిరి క్లస్టర్‌లో 109, లక్కిరెడ్డిపల్లెలో 35, రాజంపేటలో 70, రాయచోటిలో 98, తంబళ్లపల్లె క్లస్టర్‌లో కేవలం 14 మంది రైతుల పొలాల్లో బోర్లు తవ్వారు. మొత్తం మీద ఇప్పటి వరకూ జిల్లాలో తవ్విన బోర్లు మాత్రం కేవలం 326. వీటి కోసం అయిన ఖర్చు రూ.4 కోట్ల 11 లక్షలు మాత్రమే. పోనీ తవ్విన వాటికైనా మోటార్లు అమర్చారా అంటే 326 పూర్తయిన బోర్లకు గానూ కేవలం 89 మంది రైతులకు మాత్రమే మోటార్లు అమర్చారు. ఇవి కూడా రైతులు కోరినవి కాకుండా నాసిరకం మోటార్లు అందజేశారని కూడా రైతులు వాపోతున్నారు. ఈ పథకం ఇంతగా నీరుగారిపోవడానికి బోరు తవ్వకాలకు ఎంపిక చేసిన కాంట్రాక్టర్లు వెనక్కిపోవడమే ప్రధాన కారణంగా చెబుతున్నారు. ధరలు గిట్టుబాటు కాకపోవడం, సకాలానికి బిల్లుల రాకపోవడం వీరి వెనుకంజకు కారణాలుగా కూడా చెబుతున్నారు. ఇక దరఖాస్తు చేసుకుని నిరీక్షిస్తున్న వేలాదిమంది రైతులకు మాత్రం సమాధానం చెప్పేవారు లేరని అంటున్నారు.

సంక్షేమం పేరుతో దోపిడీ

- ఇదే సీఎం జగన్ నైజం
- టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు


విలేకర్లతో మాట్లాడుతున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 21: రాష్ట్రంలో వైసీపీ నాయకులు సంక్షేమం పేరుతో దోపిడీ చేస్తున్నారని, పాలన పేరుతో ప్రతిపక్షాలను, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తున్నారని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు ధ్వజమెత్తారు. బుధవారం స్థానిక దేవతానగర్‌లోని టీడీపీ పార్లమెంట్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు వారిపై అక్రమ కేసులు పెట్టారన్నారు. అవినీతిని ప్రశ్నించేవారిని అణగదొక్కుతున్నారన్నారు. డబ్బులతో, దొంగ ఓట్లతో జగన్ తిరిగి అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తున్నారని తెలిపారు. వైసీపీ పాలనలో ల్యాండు, శ్యాండ్, వైన్, మైనింగ్‌లను దోచుకుతింటున్నారన్నారు. ప్రజలు ఛీ కొడుతున్నా సిగ్గులేకుండా వైసీపీ అధికారంలోకి రావాలని కుట్రలు పన్నుతోందని, ప్రజలు దీనిని గమనిస్తున్నారని, ఎన్నికల్లో వైసీపీని ఇంటికి పంపేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ప్రభుత్వ అక్రమాలు, అవినీతిని వెలుగులోకి తీసుకొస్తున్న మీడియాపై దాడులు చేయడం దుర్మార్గమన్నారు. ప్రజాస్వామ్యంలో ఇదొక నికృష్ట చర్య అన్నారు. దాడులను ప్రోత్సహించి, దాడులు చేసిన వారిని అందలం ఎక్కిస్తూ రెచ్చగొడుతున్నారన్నారు. ఇలాంటి దాడులతో ప్రజల నుంచి వ్యతిరేకత పెరుగుతోందన్నారు. ఈ రెండు నెలలైనా పద్ధతిగా ఉండాలని వైసీపీ నాయకులకు హితవు పలికారు. మీడియాపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి యాలగిరి దొరస్వామినాయుడు, దుర్గాప్రసాద్, వెంకటేశ్, శంకర, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

అధికార పార్టీ వారికేనా!

- అర్హులకు సిరికల్చర్ యూనిట్లు ఇవ్వరా..?
- పట్టు రీలర్ల నిరసన

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 21: అధికార పార్టీ వారికే సిరికల్చర్ కాలనీలో మల్టీ ఎండ్ యూనిట్ల ఏర్పాటుకు స్థలాలు కేటాయిస్తున్నారే కానీ అనుభవం, అర్హత ఉన్న తమ దరఖాస్తులు కూడా తీసుకోవడం లేదని పట్టు రీలర్లు నిరసన తెలిపారు. బుధవారం స్థానిక సిరికల్చర్ కాలనీ వద్ద రీలర్లు నిరసన తెలిపి మాట్లాడుతూ దశాబ్ద కాలంగా తాము రీలింగ్, ట్విస్టింగ్ వృత్తిలో ఉన్నామని, అద్దె యూనిట్లు తీసుకుని వేలకు వేలు అద్దెలు చెల్లించి కాలం గడుపుతున్నామన్నారు. కొత్తగా మంజూరైన 11 యూనిట్ల స్థలాలకు దరఖాస్తులు ఇస్తే కనీసం అధికారులు తీసుకోవడం లేదన్నారు. కానీ అధికార పార్టీ వారి పేర్లను సిఫారసు చేస్తూ ఎమ్మెల్యే సిఫారసు లేఖ ఇవ్వడం బాధాకరమన్నారు. కొంతమంది అధికారులు అధికార పార్టీ వారి అడుగులకు మడుగులొత్తుతున్నారని ఆరోపించారు. రీలర్లకు మద్దతుగా నిరసన తెలిపిన బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్ మాట్లాడుతూ పేదలుగా ఉండి 16 ఏళ్లకు పైగా అనుభవం ఉన్న అర్హులైన రీలర్లు మల్టీ ఎండ్ యూనిట్లకు దరఖాస్తు చేసుకుంటే పట్టించుకోని ప్రభుత్వం అనుభవం, అర్హత లేని వైసీపీ నాయకులకు యూనిట్లను కేటాయించేందుకు చూస్తున్నారన్నారు. అంతేకాకుండా నిరసన తెలిపేందుకు వస్తున్న రీలర్లను ఓ ప్రజాప్రతినిధి బెదిరించి, వారిని రానీయకుండా చేస్తున్నాడని ఆరోపించారు. పేద ప్రజలకు న్యాయం చేయాల్సిన వైసీపీ నాయకులు స్వార్థంతో సంక్షేమ పథకాలను దోపిడీ చేస్తున్నారన్నారు. అర్హులైన రీలర్లకు న్యాయం జరిగే వరకు పోరాడతామని, ఈ విషయమై సిరికల్చర్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని, అవసరమైతే కోర్టుకు వెళతామన్నారు. కార్యక్రమంలో రీలింగ్ కార్మికులు ప్రవీణ్‌నాయుడు, వాణి, సుధాకర్‌రెడ్డి, సుజాత, రామ్మోహన్, బీఎస్‌వై నాయకులు హరీష్, చిరంజీవి, ఆదినారాయణ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


సిరికల్చర్ కాలనీ వద్ద నిరసన తెలుపుతున్న రీలర్లు, బీఎస్‌వై నాయకులు

పాత్రికేయులపై దాడులు దుర్మార్గం

- ఆంధ్రజ్యోతి, ఈనాడుపై దాడి చేసిన రౌడీలపై చర్యలు తీసుకోండి
- ములకలచెరువులో టీడీపీ రాస్తారోకో.. జాతీయ రహదారి దిగ్బంధం


ములకలచెరువులో రాస్తారోకో చేస్తున్న టీడీపీ నాయకులు

ములకలచెరువు, ఫిబ్రవరి 21: రాష్ట్రంలో ఆంధ్రజ్యోతి, ఈనాడు పత్రికల విలేకరులు, కార్యాలయాలపై దాడులు చేయడం దుర్మార్గమని, వెంటనే దాడులను ఆపాలని టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా డిమాండ్ చేశారు. అనంతపురం జిల్లా రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణ, కర్నూలు జిల్లా మద్దికెర ఆంధ్రజ్యోతి విలేకరి వీరశేఖర్, ఈనాడు కర్నూలు కార్యాలయంపై జరిగిన దాడులపై బుధవారం టీడీపీ నాయకులు ములకలచెరువు పెట్రోల్ బంకు వద్ద రాస్తారోకో నిర్వహించారు. ముంబాయి-చెన్నై జాతీయ రహదారిని దిగ్బంధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలేకరులపై విచక్షణారహితంగా దాడులు చేయడం దారుణమన్నారు. దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. దాడులకు పాల్పడ్డ సైకోలు, రౌడీలను గుర్తించి నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, నేతలు చెన్నకిష్టా, కేవీ రమణ, కేశవులు, నాగరాజుయాదవ్, నాయకులు శంకరప్ప, సుదర్శన్, ఆదినారాయణ, రమణమూర్తి, రమణారెడ్డి, సుధాకర్‌నాయుడు, రవి, శ్రీనివాసులు, జహీర్, చాంద్‌బాషా, బుర్రా రమణ, రసూల్, ప్రతాప్, గంగాద్రి, శివన్న, గౌతం, ఉమాశంకర్, కుళాయప్ప, నరసింహా తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లెలో నారా భువనేశ్వరి

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 21 : నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా పర్యటనలో ఉన్న నారా భువనేశ్వరి బుధవారం రాత్రి మదనపల్లెకు చేరుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్మోహన్‌రాజు, మదనపల్లె టీడీపీ ఇన్‌చార్జ్ దొమ్మలపాటి రమేశ్ తదితరులు నారా భువనేశ్వరికి స్వాగతం పలికారు. మదనపల్లెలో విశ్రాంతి తీసుకుని గురువారం ఉదయం ఆమె చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గంలోని పులిచర్లకు వెళ్లనున్నారు.


నారా భువనేశ్వరికి స్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకులు

శిక్షణను సద్వినియోగం చేసుకోండి : కలెక్టర్

రాయచోటి (కలెక్టరేట్), ఫిబ్రవరి 21: ఎన్నికల విధుల్లో శిక్షణ, పక్కా ప్రణాళిక, సమాచార సాంకేతికత కీలకపాత్ర పోషిస్తాయని, ఎన్నికలకు సంబంధించిన శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్లకు సూచించారు. బుధవారం స్థానిక రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో ఎన్నికలపై అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్లకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో శిక్షణ, ప్రణాళిక తయారు చేసుకోవడం, సమాచార సాంకేతికతను ఉపయోగించుకోవడం అనే మూడు అంశాలు చాలా కీలకమని తెలిపారు. ఎన్నికల శిక్షణకు సంబంధించిన నోడల్ అధికారి వెంకటేశ్వరరెడ్డి, డీపీవో ధనలక్ష్మి మాట్లాడుతూ అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్లకు ఈరోజు శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. అనంతరం మాస్టర్ ట్రైనర్ రెడ్డిబాబు, ఏపీఎంఐపీ పీడీ వెంకటేశ్వరరెడ్డి, డీపీవో ధనలక్ష్మి ఈవీఎంల నిర్వహణపై వివరణాత్మక శిక్షణ తరగతులను నిర్వహించారు. శిక్షణలో మాస్టర్ ట్రైనర్ రెడ్డిబాబు, తదితరులు పాల్గొన్నారు.

బాలుడిది ప్రమాదం కాదు..హత్య

- నిందితులైన తల్లి, ప్రియుడి అరెస్టు

మదనపల్లె, ఫిబ్రవరి 21: మదనపల్లె మండలం చిప్పిలిలో నివాసం ఉంటున్న ఎం.మయూరి కుమారుడు ఎం.హరన్ సాకేత్(3) ప్రమాదంలో చనిపోలేదని, బాలుడిని హత్య చేసినట్లు తాలూకా సీఐ శేఖర్ తెలిపారు. స్థానిక తాలూకా పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఆ కేసు వివరాలను మీడియాకు వెల్లడించారు. సీఐ కథనం మేరకు.. పులిచెర్ల మండలం కల్లూరుకు చెందిన ఎం.నాగరాజ, మయూరి భార్యాభర్తలు. వీరికి మూడేళ్ల కుమారుడు హరన్‌సాకేత్ ఉన్నాడు. ఈ క్రమంలో మద్యం షాపులో పనిచేస్తున్న సి.శివశంకర్‌రెడ్డి అలియాస్ సి.శంకర్‌రెడ్డితో నాగరాజ స్నేహంగా ఉండేవాడు. అతడు తరచూ ఇంటికి వస్తూ నాగరాజ భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. అనంతరం భర్త నాగరాజ నుంచి విడిపోయిన మయూరి కుమారుడు హరన్‌సాకేత్‌తో పాటు ప్రియుడు శివశంకర్‌రెడ్డితో కలసి మదనపల్లెకు వచ్చేసింది. ఈ క్రమంలో బి.కొత్తకోట, మదనపల్లెలలో కొంతకాలం నివాసం ఉండి తర్వాత చిప్పిలికి మకాం మార్చారు. అక్కడ అద్దె గదిలో ఉంటూ ప్రియుడు, ప్రియురాలు ఇద్దరూ స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు కంపెనీకి రెండు నెలలుగా పనికి వెళ్తున్నారు. ఈ క్రమంలో మయూరి ఈనెల 13న పనికి వెళ్లగా, ఇంటి వద్దే ఉన్న శివశంకర్‌రెడ్డి మూడేళ్ల బాలుడిని కొట్టాడు. దీంతో అపస్మారక స్థితిలో ఉన్న బాలుడిని చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లగా బాలుడు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ విషయాన్ని నిందితుడు ప్రియురాలికి చెప్పాడు. అయితే అసలు విషయాన్ని దాచేసి ఆడుకుంటూ నీటిసంపులో పడి మృతి చెందినట్లు అదే రోజు తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేసింది. తర్వాత మరుసటిరోజు తండ్రి నాగరాజ, బిడ్డ మృతదేహంపై గాయాలు ఉన్నట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అనుమానాస్పద కేసుగా నమోదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు తమదైన శైలిలో విచారణ చేపట్టడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో పోలీసులు హత్య కేసుగా నమోదు చేసి బాలుడి తల్లి మయూరి, శివశంకర్‌రెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు.


నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ శేఖర్



ఆశ నిరాశలే రాబడి



- రాలుతున్న మామిడి పిందెలు..
- ఆందోళనలో రైతులు
- విచ్చలవిడిగా రసాయనిక మందుల వాడకం
- వాతావరణం అనుకూలంగా ఉన్నా కలసిరాని మామిడి

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 21: కోడూరు మామిడికి పెట్టింది పేరు. దక్షిణాది రాష్ట్రాలే కాకుండా ఇతర రాష్ట్రాలకు ఇక్కడి నుంచి రైతులు, వ్యాపారులు మామిడి కాయలను ఎగుమతి చేస్తున్నా లాభాల కంటే నష్టాలే ఎక్కువగా వస్తున్నాయని, ఈ ఏడాది వాతావరణంలో మార్పుల కారణంగా పూత, పిందె రాలిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. దిగుబడి బాగా వచ్చినపుడు ధర ఉండదని, ధర ఉన్నపుడు దిగుబడి ఉండదని ఆశ, నిరాశల మధ్య ఊగిసలాడుతున్నామని రైతులు అంటున్నారు. మామిడి తోటలకు రైతులు విచ్చలవిడిగా రసాయనిక మందులు పిచికారీ చేస్తున్నారు. ఎక్కువ మోతాదు, చాలాసార్లు మందులు పిచికారీ చేయడంతో తోటల్లో దిగుబడులు తగ్గుతున్నాయి. చాలామంది రైతులు ఆర్గానిక్‌పై మక్కువ చూపుతున్నా, కొందరు రైతులు మాత్రం రసాయనిక మందులను వదలడం లేదు. ప్రకృతి సహజసిద్ధంగా ఉన్న వనరులను రైతులు ఉపయోగించడం లేదని ఆదర్శ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మామిడిలో లాభాల కంటే ఎక్కువగా నష్టాలను రైతులు చవిచూస్తున్నారు. వాతావరణం మామిడికి అనుకూలంగా ఉన్నా రైతులకు అది కలసి రావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తోటలకు హార్మోన్లు, పోషకాలు తక్కువ శాతం ఉండడంతో మామిడి పిందెలు ఎక్కువగా రాలుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

రైల్వేకోడూరు నియోజకవర్గంలో 25 వేల హెక్టార్లలో మామిడి సాగులో ఉంది. ఇక్కడ ప్రధానంగా బేనీషా, నీలం, పులిహోరా, రుమాణి, ఖాదర్, మల్లికా, స్వర్ణజహంగీర్, పంచదార కలస, కాలేపాడు, రెడ్డీపసందు, రసాలు, ఊరగాయ కాయలు, నాటు రకాలు తదితర రకాలను రైతులు పండిస్తున్నారు. ఎకరా మామిడి తోటకు ప్రతి ఏటా సుమారు రూ. 20 వేలు ఖర్చవుతుంది. ఈ ఏడాది ఎకరాకు రూ.30 వేలు ఖర్చు వచ్చిందని రైతులు చెబుతున్నారు. మందులు, ఎరువు లు, దున్నకాలు, కూలీలు తదితరాలు చేయించాల్సి ఉంటుం ది. నీటి యాజమాన్యం సక్రమంగా ఉండాలి. వాతావరణ పరిస్థితులు గత రెండు నెలల క్రితం సక్రమంగా లేనందున వచ్చిన పూతలు దెబ్బతిన్నాయి. మళ్లీ రైతులు మందులు పిచికారీ చేశారు. దీంతో పూతలు వచ్చాయి. అయితే పిందెలు రాలిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మామిడి చెట్లకు హార్మోన్లు, పోషకాలు సమపాళ్లలో లేనందున పిందెలు రాలిపోతున్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నా రు. మామిడికి ప్రస్తుతం నీటి యాజమాన్యంతో పాటు సస్యరక్షణ ఉండాలని ఉద్యాన అధికారులు సూచిస్తున్నారు. ఎరువుల దుకాణదారులు ఏదిపడితే ఆ ఎరువులు, పురుగుల మందులు ఇవ్వడంతో రైతులు వాటిని పిచికారీ చేయడంతో మామిడి తోటల్లో దిగుబడులు అలా ఉంచి నష్టాలు ఎక్కువగా వస్తున్నాయని ఆదర్శ రైతులు అంటున్నారు. మామిడి తోటలకు పలు తెగుళ్లు వ్యాపిస్తున్నాయి. మామిడిలో ఎక్కువ గా పిందెలు రాలడం, తేనె మంచు పురుగులు, పండు ఈగ, గూటిపురుగు తదితరవి వ్యాప్తి చెందుతున్నాయి. శాస్త్రవేత్తలు చెబుతున్న సూచనలు, సలహాలు పాటిస్తున్నా ఏమాత్రం లాభాలు కనిపించడం లేదని రైతులు చెబుతున్నారు.

రైల్వేకోడూరు మండలం మైసూరివారిపల్లె పరిధిలో ప్రైవేటు మార్కెట్ మామిడి యార్డు ఉంది. ఇక్కడ వ్యాపారాలు జోరుగా సాగుతాయి. ప్రతి ఏటా కోట్లాది రూపాయల వ్యాపారం జరుగుతుంది. సీజన్‌లో సుమారు 1000 మంది కూలీలకు ఉపాధి కలుగుతుంది. ఐదు మండలాల నుంచి మామిడి కాయలను ఇక్కడికి తరలిస్తారు. ఇక్కడ నుంచి ముంబయి, కేరళ, తమిళనాడు, రాజస్థాన్, కర్ణాటక, కోల్‌కతా, ఢిల్లీ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, పంజాబ్ తదితర నగరాలకు రైల్వేకోడూరు నుంచి మామిడి కాయలను ఎగుమతి చేస్తారు. ఇదేకాకుండా చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఉన్న జ్యూస్ పరిశ్రమలకు తోతాపూరి, నీలం తదితర రకాలను ఎగుమతి చేస్తారు. ఇన్ని అవకాశాలు ఉన్నా మామిడిలో నష్టాలు తప్ప లాభాలు ఐదేళ్లుగా రావడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మామిడి ఆశాజనకంగా లేదు..



మామిడి గత ఐదేళ్లుగా ఆశాజనకంగా లేదు. ప్రస్తుతం మామిడికి వాతావరణం అనుకూలంగా ఉన్నా ఆందోళన కల్గించే విధంగా పిందెలు రాలిపోతున్నాయి. శాస్త్రవేత్తలు చెప్పిన సూచనలు, సలహాలు తీసుకుని పాటిస్తున్నాము. మామిడికి లాభాల కంటే నష్టాలు ఎక్కువగా వస్తున్నాయి. 30 శాతం మేరకే పూతలు వచ్చాయి. గత రెండు నెలల కిందట కురిసిన అకాల వర్షాలకు పూత నాశనం అయింది. మళ్లీ పూతలు వచ్చాయి. కొన్ని ప్రాంతాల్లో మామిడి పూతలు రెండోసారి రాలేదు.

\- నాగినేని వెంకటరమణ, శెట్టిగుంట ఆదర్శ రైతు

శాస్త్రవేత్తలు చెప్పిన సూచనలు పాటించాలి..



శాస్త్రవేత్తలు చెప్పిన సూచనలు, సలహాలు రైతులు పాటించాలి. రసాయనిక ఎరువులు, పురుగు మందులు విచ్చలవిడిగా వాడకూడదు. ఆర్గానిక్ వ్యవసాయం కూడా చేయాలి. మామిడి తోటల్లో పిందెలు రాలిపోతున్నాయి. రైతులు మామిడి చెట్లకు కావాల్సిన పోషకాలను అందించాలి. నీటి యాజమాన్యం సక్రమంగా ఉండాలి. వాతావరణం అనుకూలంగా ఉంది. సూచనలు, సలహాలు తీసుకుని పాటించాలి.

\- కె.గోపాల్, ఉద్యాన యూనివర్సిటీ అసోసియేట్ డీన్, అనంతరాజుపేట



గల్లీకో గంజాయి బ్యాచ్

● విచ్చలవిడిగా గంజాయి విక్రయాలు ● పెడదోవ పడుతున్న యువత

కడప (క్రైం), ఫిబ్రవరి 21: యువత పెడదోవ పడుతోంది. గంజాయి మత్తుకు బానిస అవుతోంది. మైనర్లు సైతం గంజాయి మత్తుకు అలవాటు పడుతున్నారు. జిల్లాలో ఎక్కడ చూసినా గంజాయి దొరుకుతుండటంతో గల్లీకో గంజాయి బ్యాచ్ తయారవుతోంది. గంజాయిని ఏజెన్సీ ప్రాంతాల నుంచి తెప్పించుకుంటూ వాటిని పొట్లాలుగా మార్చి యువతకు ఒక పొట్లం రూ.60 నుంచి రూ.100 వరకు విక్రయిస్తున్నారు. ఇప్పుడు కొత్తగా మత్తు ఇంజక్షన్ రూపంలో గంజాయి తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.



గంజాయి పీల్చే యువకుడికి కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి (ఫైల్)

యుక్తవయసులోనే అనారోగ్యంపాలు

యువత మత్తు, మద్యం, ధూమపానంతో యుక్త వయసులోనే అనారోగ్యంపాలవుతున్నారు. బాధితుల్లో దాదాపు 80 శాతం మంది గంజాయి, మద్యం వంటివి ఎక్కువగా తీసుకుంటున్నట్లు సమాచారం. యువత మొదట సిగరెట్లకు అలవాటుపడితే ఆ తరువాత క్రమంగా గంజాయికి బానిసలవుతున్నారు. గంజాయి వ్యాపారం చేసే వారంతా మహిళలు, యువకులతోపాటు విద్యార్థులు కూడా ఉండడం గమనార్హం. చత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్‌లోని ఏజెన్సీ ప్రాంతాల్లో నుంచి గంజాయి పొడిగా మార్చి విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. కళాశాల, పాఠశాలను లక్ష్యంగా చేసుకుని వీటిని విక్రయిస్తున్నారని సమాచారం.

గంజాయి విక్రయాలపై కఠినంగా వ్యవహరిస్తున్నాం..

గంజాయి విక్రయాలపై కఠినంగా వ్యవహరిస్తున్నాం. ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసి నిఘా ఉంచడంతో పాటు గంజాయి పీల్చే వారిపై కూడా చర్యలు తీసుకుంటున్నాం. గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం మోపుతున్నాం. సమాచారం తెలిసిన వెంటనే మా సిబ్బంది నిమిషాల్లో అక్కడకు వెళ్లి పట్టుకుంటున్నారు. గంజాయి విక్రయాలపై ప్రజలు సమాచారమిస్తే పూర్తిస్థాయిలో కట్టడి చేస్తాం.

- ఎస్ఎండీ షరీఫ్, కడప డీఎస్పీ

నేరాలకు పాల్పడుతున్న యువకులు

కడప నగరంలో కొంత మంది యువకులు, మైనర్లు గంజాయికి అలవాటు పడ్డారు. వీరు గంజాయి మత్తులో గొడవలకు తెగబడుతున్నారు. కడపలో బిస్మిల్లానగర్, బుగ్గవంక కాల్వ ప్రహరీల వద్ద, సాయిపేట, ఖలీల్‌నగర్, తారకరామానగర్, తిలక్ నగర్, ఆర్కేనగర్, మాచుపల్లె రోడ్డుతో పాటు నగర శివార్లలోని రోడ్లలో గంజాయి సేవిస్తూ యువత విచ్చలవిడిగా తిరుగుతున్నారు. గంజాయి మత్తులో నగరంలో ఎన్నో గొడవలకు కారణమవుతున్నారు. కొంతమంది ఆన్‌లైన్‌లో కత్తులను కొనుగోలు చేసి వెంటపెట్టుకుని తిరుగుతున్నట్లు సమాచారం.

బద్వేలులో చోరీ

8 తులాల బంగారు, ఒకటిన్నర కేజీ వెండి పాత్రల అపహరణ

బద్వేలు టౌన్, ఫిబ్రవరి 21 : బద్వేలులో తాళం వేసిన ఇంట్లోకి చొరబడిన దొంగలు 8 తులాల బంగారు, ఒకటిన్నర కేజీ వెండి పాత్రలను దోచుకెళ్లారు. ఈ ఘటన మంగళవారం చోటు చేసుకోవడంతో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బద్వేలులోని శివాలయంవీధిలో నివాసం ఉంటున్న సాంబశివరావు బంధువుల వివాహ వేడుకలకు మూడు రోజుల ముందు కుటుంబసమేతంగా అనంతపురం వెళ్లారు. తిరిగి మంగళవారం ఇంటికి వచ్చి చూసేసరికి తాళాలు, తలుపులు పగలగొట్టి ఉండడంతో ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాను కూడా పగలగొట్టి దొంగలు నగలు, వెండి వస్తువులను అపహరించినట్లు గుర్తించారు. ఈ విషయాన్ని వెంటనే సాంబశివరావు పోలీసులకు సమాచారం అందించారు. సీఐ యుగంధర్ సిబ్బందితో అక్కడికి చేరుకుని చోరీ జరిగిన తీరును గమనించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బీరువాను పగలగొట్టి చెల్లాచెదురు చేసిన దొంగలు

వ్యాయామ విద్యతోనే

జీవన ప్రమాణాల మెరుగు


అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాశ్‌రెడ్డి

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 21: వ్యాయామ విద్యతోనే మనిషి జీవన ప్రమాణాలు మెరుగవుతాయని అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాశ్‌రెడ్డి అన్నారు. విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు బుధవారం రాయచోటి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఫిబ్రవరి నెలకు సంబంధించి స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ వ్యాయామ విద్యతో మానవుల, వ్యక్తుల జీవన ప్రమాణాలు మెరుగవుతాయని, విద్యార్థుల శారీరక, మానసిక అభివృద్ధికి తోడ్పడతాయన్నారు. విద్యార్థులు వ్యాయామ విద్య ద్వారా క్రమశిక్షణ పెంపొందించుకోవాలని సూచించారు. అలాగే భవిష్యత్తులో జరగబోయే కాంప్లెక్స్ సమావేశాలకు పీడీలు, పీఈటీలు డ్రెస్ కోడ్‌లో రావాలని ఆదేశించారు. సమావేశంలో వ్యాయామ విద్య నియోజకవర్గ బాధ్యులు జగదీశ్వరయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి వీరాంజనేయులు, జిల్లా స్కూల్ గేమ్స్ జాయింట్ సెక్రటరీ రెడ్డెయ్య, పీడీలు లలితమ్మ, లక్ష్మీనారాయణ, వెంకటరాజు, నిర్మలమ్మ, పద్మజ, అమర్‌నాథరెడ్డి, వరదరాజు, చక్రపాణి, గంగరాజు, ఫయాజ్, కొండలరావు, అంజి, వాణి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో శివప్రకాశ్‌రెడ్డి

నేటి నుంచి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు





చెన్నకేశవస్వామి ఆలయం, మూలవిరాట్ చెన్నకేశవస్వామి

వల్లూరు, ఫిబ్రవరి 21 : మండల పరిధిలోని పైడికాల్వలో శ్రీరాజ్యలక్ష్మి సమేత చెన్నకేశవస్వామి వార్షిక బ్రహ్మోత్సవ కుంభాభిషేకాలు గురువారం నుంచి శనివారం మాఘ పౌర్ణమి వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు హరినారాయణశర్మ తెలిపారు. ఈ హరిహరక్షేత్రంలో జనమేజయుల కాలం నుంచి స్వామివారు కొలువై ఉన్నారన్నారు. ముఖ్యంగా ఈ స్వామిని కొలిస్తే సర్పదోష నివారణతో పాటు సంతాన భాగ్యం కూడా కలుగుతుందని అన్నారు. ప్రతి శనివారం రాహుకాల అభిషేకాలు చేస్తే దోషాలను తొలగించుకునేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరంలాగే లోక కల్యాణ సంకల్పంతో ఈ వార్షిక బ్రహ్మోత్సవాలు, కుంభాభిషేకాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. గురువారం గణపతిపూజతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. అదేరోజు రాత్రి 7 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలుంటాయన్నారు. 23వ తేదీ శుక్రవారం ఉదయం సుప్రభాత సేవ అనంతరం చండీ హోమం, మహా మృత్యుంజయ హోమం, రుద్రహోమంతో పాటు దంపతీ సుహాసినీ కన్య పూజ నిర్వహిస్తామన్నారు. 24వ తేదీ శనివారం ఉదయం 5 గంటలకు సుప్రభాతసేవతో మొదలై స్వామివారికి కుంభాభిషేక మహోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. అనంతరం స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తామన్నారు. రాత్రి 8 గంటలకు రేలారే రేలారే జానపద కార్యక్రమం నిర్వహిస్తామని అన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలి

బ్రహ్మంగారిమఠం, ఫిబ్రవరి 21 : తరగతి గదిలో వెనుకబడిన విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యను బోధించాలని రాష్ట్ర పరిశీలన బృందం డైట్ ఫ్యాకల్టీ కె.రాజేంద్రప్రసాద్, గణిత పరిశీలకుడు అట్ల నరసింహారెడ్డి, తెలుగు పరిశీలకుడు జీసీ నాగప్ప తెలిపారు. బుధవారం లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంటు ప్రోగ్రాం అభ్యసనాభివృద్ధి కార్యక్రమంలో భాగంగా అనంతపురం బుక్కపట్నం డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రామక్రిష్ణ ఆధ్వర్యంలో రాష్ట్ర పరిశీలన బృందం బి.మఠానికి చేరుకుని మల్లేపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామక్రిష్ణ, రాజేంద్రప్రసాద్, సోషల్ పరిశీలకుడు బాబాసాహెబ్, ఎంఈవో వెంకటేశ్వర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న రాష్ట్ర పరిశీలకులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కడప (నాగరాజుపేట), ఫిబ్రవరి 21: కడప-తాడిపత్రి జాతీయ రహదారి తప్పెట్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ, ద్విచక్రవాహనం ఢీకొన్న సంఘటనలో ద్విచక్ర వాహనదారుడికి గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు... కమలాపురం మండలం కోగటం గ్రామానికి చెందిన జిలానీబాషా ద్విచక్ర వాహనంపై కడప నుంచి స్వగ్రామానికి వెళుతుండగా కమలాపురం వైపు వెళుతున్న లారీ ఢీకొనడంతో గాయపడ్డాడు. సంఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు గాయాలైన జిలానీబాషాను 108లో కడప రిమ్స్‌కు తరలించి ప్రమాదానికి గల కారణాలను అన్ని కోణాల్లో పరిశీలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



గాయపడ్డ జిలానీబాషా

కడపలో స్కూటరిస్టుకు గాయాలు

కడప (క్రైం), ఫిబ్రవరి 21 : కడప నగరం ఫాతిమా మెడికల్ కళాశాల సమీపంలో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్టుకు గాయాలయ్యాయి. ప్రసాద్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంలో కడప రోడ్డుకు వస్తుండగా కడప నుంచి పులివెందుల వైపు వెళుతున్న కారు వేగంగా వచ్చి స్కూటరును ఢీకొంది. ఈ ప్రమాదంలో ప్రసాద్ గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం స్థానికులు రిమ్స్‌కు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



గాయపడ్డ ప్రసాద్

బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో సౌత్ ఇండియన్ ముసాయిద్ యాక్షన్ కమిటీ నేతలు

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 21: రానున్న సార్వత్రిక ఎన్నికలను ఈవీఎంల ద్వారా కాకుండా పాత పద్ధతైన బ్యాలెట్ పేపర్ ద్వారా ఎన్నికలు చేపట్టి తద్వారా ప్రజాస్వామ్యాన్ని, భారతరాజ్యాంగ విలువలను కాపాడాలని సౌత్ ఇండియన్ ముసాయిద్ యాక్షన్ కమిటీ బోర్డు నాయకులు భారత ఎన్నికల సంఘాన్ని కోరారు. బుధవారం స్థానిక రవీంద్రనగర్‌లోని ఆ కమిటీ కార్యాలయంలో సంబంధిత కమిటీ బోర్డు కన్వీనర్ ఎస్.జహీరుద్దీన్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశానికి పలు పార్టీల, ప్రజాసంఘాల నాయకులు హాజరై మాట్లాడారు. మనదేశంలో ఈవీఎంల ద్వారా జరుపుతున్న ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగే అవకాశాలు లేవన్నారు. ముఖ్యంగా ఎన్నికల రోజున ప్రజలు వివిధ పార్టీలకు ఓట్లేసినా కూడా ఆ ఓట్లు ఒకే పార్టీకి అనుకూలంగా ఫలితాలు వెలువడుతున్నాయనే అనుమానాలు ప్రజలతో పాటు పార్టీల నాయకుల్లో కూడా ఉందన్నారు. గతంలో ప్రతిపక్షాలు ఎన్నికల అధికారిని ఈవీఎంలపై మాట్లాడినపుడు వారి వద్ద సరైన సమాధానం లేదన్నారు. దీంతో ప్రజల్లో మరింతగా అనుమానాలు పెచ్చుమీరినట్లు వెల్లడించారు., కావున ఈవీఎంలు వద్దు బ్యాలెట్ పేపరే ముద్దు అనే సభా కార్యక్రమాన్ని ఈనెల 23వ తేదీ శుక్రవారం సాయంత్రం 6 గంటలకు నగర రవీంద్రనగర్‌లోని యూఎస్ మహల్‌లో చేపడుతున్నట్లు వెల్లడించారు. ఆ సభకు కులమతాలకతీతంగా ప్రజలు పెద్దఎత్తున హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు నజీర్‌అహ్మద్, అలీఖాన్ (కాంగ్రెస్) రామమోహన్‌రెడ్డి (సీపీఎం) కె.సి.బాదుల్లా (సీపీఐ) మగ్బుల్ బాష, (ఆర్‌సీపీ) మోహన్‌బాబు, విల్సన్ (ఫాదర్లు) సి.ఆర్.వి.ప్రసాద్ (హేతువాద సంఘం) తాహిరుల్లా, ఖాదర్, సిరాజ్‌బుఖారి, జమీత్ బుఖారి, సయ్యద్ జహూర్, తదితరులు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న జహీరుద్దీన్

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభం

చాపాడు, ఫిబ్రవరి 21: మండలంలోని నక్కలదిన్నె గ్రామంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ విజయరామరాజు, మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి బుధవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని సుమారు 20 వేల మంది ప్రజలకు వైద్యం పొందేందుకు ఈ ఆస్పత్రి సౌకర్యంగా ఉంటుందన్నారు. ఈ ఆస్పత్రిలో ప్రాథమిక వైద్యం, గర్భిణీలకు కాన్పులు చేసేందుకు సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇద్దరు డాక్టర్లు పరీక్షలు చేసేందుకు ఉంటారన్నారు.



ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ విజయరామరాజు

బాలికలకు నాణ్యమైన విద్య అందించాలి

చాపాడు, ఫిబ్రవరి 21: జిల్లాలోని కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాలలోని బాలికలకు నాణ్యమైన విద్య అందించాలని సమగ్ర శిక్ష అభియాన్ పీవో అంబవరం ప్రభాకర్‌రెడ్డి చెప్పారు.

చాపాడులోని కస్తూర్బాగాంధీ గురుకుల బాలికల పాఠశాలలో బుధవారం 10వ తరగతి, సీనియర్ ఇంటర్ బాలికలకు వీడ్కోలు సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రణాళికాబద్ధంగా చదువుకుని పట్టుదలతో లక్ష్యాన్ని సాధించాలన్నారు. పేదరికం నుంచి బయట పడాలంటే చదువుతోనే సాధ్యమవుతుందన్నారు. ఆ పాఠశాల స్పెషల్ ఆఫీసర్ నాగలక్ష్మి మాట్లాడుతూ 10వ తరగతి బాలికలకు పబ్లిక్ పరీక్షలకు సంబంధించి అన్ని పాఠశాలలు పూర్తిస్థాయిలో బోధించడం జరిగిందన్నారు. మోడల్ పేపర్లు కూడా తయారు చేసి ఇచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బాలికలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న పీవో ప్రభాకర్‌రెడ్డి

మద్యం విక్రేత అరెస్టు... 30 మద్యం సీసాలు స్వాధీనం

కడప (క్రైం), ఫిబ్రవరి 21 : నగర పరిధిలోని పాతబస్టాండు వద్ద గల రాయల్ థియేటరు వెనుక వైపున మద్యం అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసి అతడి వద్ద ఉన్న 30 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ ఎస్ఐ తెలిపారు. అందిన సమాచారం మేరకు దాడి చేసి రాజారెడ్డివీధికి చెందిన నల్లబల్లి కిరణ్ అనే వ్యక్తిని అరెస్టు చేసి అతడి వద్ద ఉన్న మద్యంబాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



జీవనశైలి, వ్యాధులపై అవగాహన కల్పించాలి

● అన్నమయ్య జిల్లా డీఎంహెచ్‌వో కొండయ్య

పీలేరు, ఫిబ్రవరి 21: జీవనశైలి వ్యాధులైన బీపీ, షుగర్ గురించి గ్రామీణులకు విస్తృత అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో డా.కొండయ్య వైద్య సిబ్బందికి ఆదేశించారు. కేవీపల్లె మండలం గోరంట్లపల్లె పంచాయతీ జంగలపల్లెలో బుధవారం జరిగిన 104 వాహన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్రమత్తత, అవగాహనతోనే ప్రజలు జీవనశైలి వ్యాధుల బారిన పడకుండా ఉంటారని, వ్యాధుల నివారణకు పాటించాల్సిన ఆరోగ్య, భోజన విధానాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. 104 వాహనం ద్వారా అందించాల్సిన వైద్య సేవల్లో ఎలాంటి అలసత్వం ప్రదర్శించరాదని, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. 104 వాహనంలో నిర్వహిస్తున్న ఓపీ రిజిస్టర్, మందుల నిల్వలను పరిశీలించారు. ఆ తరువాత సొరకాయలపేట పంచాయతీ మినిమిరెడ్డిగారిపల్లెలోని ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అక్కడ నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల సెషన్‌ను తనిఖీ చేశారు. టీకాల నిల్వ, లబ్ధిదారుల లిస్టు పరిశీలించారు. అర్హులైన ప్రతి గర్భిణీ, శిశువుకూ 100 శాతం టీకాలు అందజేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో చంద్రమైత్రి సుధా, ఆరోగ్య కార్యకర్త రిహానా బేగం, 104 సిబ్బంది ధరణి, రెడ్డిమోహన్, ఆశా కార్యకర్తలు లక్ష్మీదేవి, విజయమ్మ, తదితరులు పాల్గొన్నారు.



గోరంట్లపల్లెలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో కొండయ్య

డ్రాగా ముగిసిన క్రికెట్ మ్యాచ్



ఆంధ్రా, రైల్వేస్ జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్

కడప (స్పోర్ట్స్) ఫిబ్రవరి 21: రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి క్రికెట్ స్టేడియంలో ఈనెల 18 నుంచి జరుగుతున్న కల్నల్ సి.కె.నాయుడు అండర్-23 ట్రోఫీ క్రికెట్ మ్యాచ్‌లో భాగంగా ఆంధ్రా-రైల్వేస్ జట్ల మధ్య నిర్వహించిన మ్యాచ్ బుధవారం డ్రాగా ముగిసింది. తొలుత టాస్ నెగ్గిన ఆంధ్రా జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 93.5 ఓవర్లలో 378 పరుగులకు ఆలౌట్ అయిన సంగతి తెలిసిందే. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రైల్వేస్ జట్టు 231 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 865 పరుగులు భారీ స్కోర్ చేసి డిక్లేర్ చేసింది. ఇందులో ఓవర్‌నైట్ స్కోర్ 235 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో వున్న అనిష్‌యాదవ్ చివరి రోజైన బుధవారం బ్యాటింగ్‌కు దిగి మరో 33 పరుగులు జోడించి 268 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద అవుట్ అయ్యాడు. అలాగే 117 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో ఉన్న మరో బ్యాటర్ అంచిత్ యాదవ్ మరో 16 పరుగులు మాత్రమే జోడించి 133 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద ఔట్ కాగా మరో బ్యాటర్ తౌఫికుద్దీన్ 87 పరుగులు చేశారు. దీంతో రైల్వేస్ జట్టు భారీ స్కోర్ నమోదు చేసింది. ఆంధ్రా జట్టు బౌలర్లలో వంశీకృష్ణ, విజయ్, వాసులకు రెండు వికెట్ల చొప్పున దక్కాయి. దీంతో నిర్వాహకులు మ్యాచ్‌ను డ్రాగా ముగించారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

వాల్మీకిపురం, ఫిబ్రవరి 21: పట్టణంలోని పట్టాభి రామాలయంలో బుధవారం టీటీడీ ఆధ్వర్యంలో పునర్వసు సీతారాముల కల్యాణోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ మొదలు ఆలయంలోని మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవలతో ప్రత్యేక పూజలు జరిగాయి. నూతన వధూవరులైన సీతారాములకు విశేష అలంకరణలు చేశారు. మంగళ వాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చారణలు, విశేష భక్తజనం నడుమ రాములోరి కల్యాణం కమనీయంగా సాగింది. సాయంత్రం సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాముల నగరోత్సవం నిర్వహించారు.

ప్రతి కార్యకర్త రుణం తీర్చుకుంటా

- మాజీ ఎమ్మెల్యే రమేశ్‌కుమార్‌రెడ్డి

రామాపురం, ఫిబ్రవరి 21: ప్రతి కార్యకర్త రుణం తీర్చుకుంటానని మాజీ ఎమ్మెల్యే రమేశ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన రామాపురంలోని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎం.రమేశ్‌రెడ్డి స్వగృహంలో బుధవారం అభిమానులు, కార్యకర్తలతో వేల సంఖ్యలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో తాను పనిచేసిన విధంగా ఏ నాయకుడు పనిచేయలేదన్నారు. కొందరు తనపై అధిష్టానానికి తప్పుడు సమాచారం ఇచ్చి తాను టీడీపీలో సరిగ్గా పనిచేయలేదని చెప్పడం బాధను కలిగించిందన్నారు. రాయచోటి అసెంబ్లీ నుంచి పోటీ చేసి ఓటమి చెందిన తాను ఎల్లప్పుడూ ప్రజల్లోనే ఉంటూ వారి సమస్యలను తెలుసుకుంటూ ఉన్నానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రమేశ్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నాగేందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీలు నాగసుబ్బారెడ్డి, నరసారెడ్డి, భాస్కర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, చంద్రమౌళి, రామకృష్ణగౌడ్, నాగభూషణ్‌రెడ్డి, ఖాదర్‌వలి, హరిప్రసాద్, షంషేర్, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, ఆర్ఆర్ అభిమానులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రమేశ్‌కుమార్‌రెడ్డి

కంచె చేను మేస్తే కాపాడేదెవరు ?

- తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు


కలెక్టర్ కార్యాలయం దగ్గర నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి 21: కంచె చేను మేస్తే కాపాడేది ఎవరన్నట్లుగా జిల్లాలో పరిస్థితి ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు ఎద్దేవా చేశారు. పేదలకు న్యాయం చేయాలని కోరుతూ బుధవారం కలెక్టర్ కార్యాలయం ముందు సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బి.కొత్తకోట మండలంలో అధికారుల అండదండలతో ప్రభుత్వ భూములు, పేదల భూములు కబ్జా అవుతున్నాయని ఆరోపించారు. గతంలో బి.కొత్తకోట తహసీల్దార్‌గా పనిచేసిన అధికారి యథేచ్ఛగా దొంగ పట్టాలు, వన్‌బీలు మంజూరు చేశారని వారు ఆరోపించారు. మంజూరు చేసిన పట్టాలపై సమగ్రంగా విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని వారు తెలిపారు. అనంతరం కలెక్టర్ అభిషిక్త్‌కిశోర్‌కు వినతి పత్రం అందజేశారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు వీరప్ప, గొల్లపల్లె గ్రామ ప్రజలు రమణప్ప, రెడ్డెప్ప, వెంకట్రమణ, శ్రీనివాసులు, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలను చేరుకోవాలి


వీడ్కోలు సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో

గాలివీడు, ఫిబ్రవరి 21: ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మండల విద్యాధికారులు నాగరాజు, శ్రీనివాసులు పేర్కొన్నారు. గాలివీడు పట్టణంలోని స్థానిక రెడ్డెప్పగారి రాజగోపాల్‌రెడ్డి జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థుల వీడ్కోలు సమావేశం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వారు హాజరై మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కళాశాలలో నేర్చిన క్రమశిక్షణతో జీవితంలో ఉన్నతమైన శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కళాశాల గౌరవ సలహాదారుడు ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్ఆర్‌జీఆర్‌లో చదువుకున్న ఎంతోమంది ఉన్నత స్థాయి ఉద్యోగాలు చేస్తున్నారని, వివిధ ప్రైవేటు సంస్థల్లో అధిక జీతాలు పొందుతున్నారని గుర్తు చేశారు. అనంతరం అతిథులు, అధ్యాపకులను దుశ్శాలువాలతో ప్రత్యేకంగా సన్మానించారు. ఆ తర్వాత విద్యార్థినీ, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి, గంగిరెడ్డి, గౌరవ సలహాదారుడు ఓబుల్‌రెడ్డి, అధ్యాపకులు శివప్రసాద్ రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, రమణ, మహేశ్‌నాయుడు, అయ్యప్ప, జనార్ధన్‌రెడ్డి, వెంకటేశ్, కళాశాల అధ్యాపక బృందం బోధనేతరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

- ఎస్ఐ వెంకటప్రసాద్


ప్రజలతో సమావేశం నిర్వహిస్తున్న ఎస్ఐ

గాలివీడు, ఫిబ్రవరి 21: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ వెంకటప్రసాద్ హెచ్చరించారు. బుధవారం మండలంలోని ఎగువగొట్టివీడు గ్రామంలో శాంతి భద్రతలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ త్వరలో జరగబోవు సార్వత్రిక ఎన్నికల్లో ప్రశాంత వాతావరణంలో గ్రామాల్లో పోలింగ్ జరిగేందుకు అందరూ సహకరించాలన్నారు. అలాకాదని విద్వేషాలతో ముఠా కక్షలను ప్రేరేపించి అల్లర్లకు పాల్పడితే అలాంటి వారిపై బైండోవర్లు, రౌడీషీటర్లు తెరిచి కటకటాల్లోకి పంపుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

లక్ష మెజార్టీనే లక్ష్యం : ఖాదర్‌బాషా


భువనేశ్వరితో గాజుల ఖాదర్‌బాషా

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 21: రాబోయే ఎన్నికల్లో కుప్పం నియోజకవర్గంలో లక్ష మెజార్టీతో గెలవడమే తమ లక్ష్యమని కుప్పం నియోజకవర్గ పరిశీలకుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా అన్నారు. చంద్రబాబునాయుడు అరెస్టు సమయంలో బాధను తట్టుకోలేక మృతి చెందిన కుటుంబాలను పరామర్శించేందుకు బుధవారం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి కుప్పం నియోజకవర్గానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆమెకు టీడీపీ నేతలు ఘనస్వాగతం పలికారు. చంద్రబాబు జైల్లో ఉన్న బాధ కంటే రాష్ట్రం ప్రజల భవిష్యత్తు ఎలా అని నారా భువనేశ్వరి బాధపడ్డారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కుప్పం నియోజకవర్గ ఇన్‌చార్జి మునిరత్నం, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

'నిర్లక్ష్య ధోరణి వద్దు'

రైల్వేకోడూరు(రూరల్), ఫిబ్రవరి 21: ఎన్నికల పట్ల నిర్లక్ష్య ధోరణి వద్దని కాంగ్రెస్ జిల్లా ఎన్నికల పరిశీలకుడు వెంకట నరసింహులు నియోజకవర్గ ఐదు మండలాల నాయకులకు హితవు పలికారు. బుధవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ గోసాలదేవి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షర్మిల రాకతో పార్టీ బలోపేతమైందని, మండల స్థాయి నాయకులు బూత్ లెవల్ కమిటీలను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. కాంగ్రెస్ విజయం కోసం అహర్నిశలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐదు మండలాల అధ్యక్షులు, మహిళ నాయకురాలు ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యుద్ధానికి సంసిద్ధంగా ఉండాలి : రేవతి


ఎగువకొత్తపల్లిలో ఓటర్లకు మేనిఫెస్టో గురించి వివరిస్తున్న దృశ్యం

పెనగలూరు, ఫిబ్రవరి 21: రాష్ట్రంలో మరో 50 రోజుల్లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో అరాచక ప్రభుత్వం వైసీపీతో తలపడేందుకు ప్రజలు అన్ని విధాలా సంసిద్ధంగా ఉండాలని రైల్వేకోడూరు టీడీపీ నాయకురాలు నగరిపాటి రేవతి ప్రజలను కోరారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర, జిల్లా మండల నాయకులతో పాటు కార్యకర్తలు, సాధారణ ప్రజలను కూడా ఆమె కలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు అట్టడుగు వర్గాల ప్రజలను అభివృద్ధిలోకి తీసుకొచ్చేందుకు సూపర్ సిక్స్ పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. సిద్దవరం, తిరుమలరాజుపేట, కొత్తపల్లి, కంబాలకుంట, సింగనమల, ఓబిలి, సాతుపల్లి గ్రామాలలో ఆమె ప్రజలను కలుసుకొని వైసీపీ ప్రభుత్వం గత నాలుగున్నరేళ్లలో చేసిన అరాచకాలు, అంతకంటే ముందు టీడీపీ అవలంభించిన శాంతియుత పరిపాలన గురించి బేరీజు వేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆమె వెంట పార్లమెంటు తెలుగు యువత ఉపాధ్యక్షుడు రాంప్రసాద్‌నాయుడు, జిల్లా అధికారప్రతినిధి బాలకృష్ణ, జిల్లా వాణిజ్య విభాగం కార్యదర్శి మురళి, మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి షామీర్, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు చీనేపల్లి చిన్న, డాక్టర్ తులసి రామకృష్ణయ్య, మాజీ తహశీల్దారు సుబ్రమణ్యం పాల్గొన్నారు.

తేనెకంటే తియ్యనైనది తెలుగుభాష

రాజంపేట, ఫిబ్రవరి 21: తేనెకంటే తియ్యనైనది తెలుగు భాష అని విశ్రాంత న్యాయమూర్తి రామాంజనేయులు పేర్కొన్నారు. రాజంపేట రాయలసీమ హైస్కూల్ ప్రాంగణంలో బుధవారం జరిగిన తెలుగు భాష దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం ప్రపంచ స్థాయికి ఎదిగినా మాతృభాషను మర్చిపోకూడదని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర మానవ హక్కుల లీగల్ అడ్వైజర్ లక్ష్మీనారాయణ, ఆదినారాయణ, కృష్ణ చైతన్య, కోటంరెడ్డి పాల్గొన్నారు.

తెలుగుభాషను కాపాడుకుందాం

తెలుగు భాషను కాపాడుకోవాలని తెలుగుభాష సంరక్షణ సమితి రాజంపేట మండల శాఖ అధ్యక్షుడు రామచంద్రయ్య నాయుడు, విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు బి.వి.నారాయణరాజులు అన్నారు. పట్టణంలోని స్థానిక రీజెన్సీ నలంద పాఠశాలలో బుధవారం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు లయన్ అబ్దుల్లా, రీజెన్సీ నలంద పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మురళీమోహన్‌రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నందలూరు: మధురమైన భాష మన తెలుగు భాష అని, దాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి తెలుగువారిపై ఉందని నాగిరెడ్డిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయలలిత కుమారి పేర్కొన్నారు. అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా తెలుగు ఉపాధ్యాయుడు గంగనపల్లి వెంకటరమణ, గీతా, రమణమ్మల ఆధ్వర్యంలో బుధవారం పాఠశాలలో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు ఖాదర్‌బాషా, డాక్టర్ నాగేంద్రప్రసాద్, శిల్పానందాచారి, వెంకటసుబ్బయ్య, విజయకుమారి, మస్తాన్, రమణమ్మ, ప్రమీల, రాహేల్, జ్యోతిప్రియ, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

గురువును మించిన దైవం లేదు

- ప్రిన్సిపాల్ రఘురామయ్య

వీరబల్లి, ఫిబ్రవరి 21: గురువును మించిన దైవం లేదని వీరబల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రఘురామయ్య తెలిపారు. బుధవారం కళాశాల అధ్యాపకులైన శ్రీనివాసులశెట్టి, రామనారాయణ ముందస్తు పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన అధ్యాపకుల గురించి కొనియాడారు. సమాజంలో పూజింపబడే వారు గురువులేనన్నారు. అనంతరం వారిని శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో కలకడ ప్రిన్సిపాల్ రమణయ్య, బోటనీ లెక్చరర్ నరసింహారెడ్డి, వేంపల్లి వాసవి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సురేంద్ర, అధ్యాపకులు రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


పదవీ విరమణ పొందిన అధ్యాపకులను సన్మానిస్తున్న దృశ్యం

విలేకర్లపై దాడులు పిరికిపంద చర్య


తహశీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

నందలూరు, ఫిబ్రవరి 21: విలేకరులపై దాడులు పిరికిపంద చర్య అని, జర్నలిస్టులకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల పత్రికా విలేకర్లు పేర్కొన్నారు. జర్నలిస్టులపై దాడులకు నిరసనగా మండల పత్రికా విలేకర్లు స్థానిక తహశీల్దారు షేక్ మహబూబ్‌బాషాకు బుధవారం మధ్యాహ్నం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో అమరావతి, రాప్తాడు, కర్నూలు ప్రాంతాల్లో వైసీపీ రౌడీ మూకలు నిజాన్ని నిర్భయంగా వెలికితీస్తున్న ఆంధ్రజ్యోతి, ఈనాడు సంస్థలతో పాటు జర్నలిస్టులపై దాడి చేయడం హేయమైన చర్య అని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు శివశంకర్(ఆంధ్రజ్యోతి), పగడాల రంగస్వామి (ఆంధ్రప్రభ), సురేష్ (ఈనాడు), తదితర జర్నలిస్టులు శ్రీరాములు, మెహర్, జయసింహ, రమణ, రమణ పాల్గొన్నారు.

మారెడ్డిని పరామర్శించిన విశ్వనాథనాయుడు


మారెడ్డిని పరామర్శిస్తున్న దృశ్యం

రైల్వేకోడూరు(రూరల్), ఫిబ్రవరి 21: వైసీపీ రౌడీమూకల చేతిలో కత్తిపోట్లకు గురైన రాష్ట్ర తెలుగు రైతు అధ్యక్షుడు మారెడ్డి శ్రీనివాసులరెడ్డిని రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జ్ కస్తూరి విశ్వనాథనాయుడు బుధవారం ఒంగోలు రమేశ్ ఆసుపత్రిలో పరామర్శించారు. వైసీపీ నాయకులు రాక్షసుల్లా వ్యవహరిస్తున్నారని, అటు టీడీపీ కార్యకర్తలపై ఇటు మీడియాపై దాడులు చేస్తున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఇలాంటి వారిని ఏరిపారేస్తామని హెచ్చరించారు. ఈయన వెంట పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వరనాయుడు, ప్రముఖ న్యాయవాది రెడ్డయ్య ఉన్నారు.

బీజేపీ జెండా కూల్చడంపై ఫిర్యాదు

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 21: మండలంలోని తల్లెంవారిపల్లె గ్రామంలో బీజేపీ జాతీయ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆ పార్టీ జెండా ఆవిష్కరణ స్తంభాన్ని కూల్చివేయడంతో పాటు ఫ్లెక్సీలను చించివేయడంపై మండల బీజేపీ అధ్యక్షుడు చిన్నరెడ్డి రాజగోపాల్‌రెడ్డి రాజంపేట డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. తన సొంత గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రధాని మోదీ ఫ్లెక్సీలను, పార్టీ జెండాలను ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఫిర్యాదు చేశారు. అందుకు డీఎస్పీ సానుకూలంగా స్పందించినట్లు బీజేపీ రాష్ట్ర యువనాయకుడు చిన్నిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులకు షబ్బీర్, రామిరెడ్డి బుజ్జిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెరటి తోటలతో ఆర్థిక భరోసా

- ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కే.గోపాల్


ఇన్‌పుట్స్ పంపిణీ చేస్తున్న అసోసియేట్ డీన్ డాక్టర్ గోపాల్

రైల్వేకోడూరు(రూరల్), ఫిబ్రవరి 21: పెరటితోటల పెంపకం ద్వారా రైతులకు ఆర్థికంగా భరోసా లభిస్తుందని ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కే.గోపాల్ తెలిపారు. బుధవారం ఉద్యాన కళాశాలలో భారత వ్యవసాయ పరిశోధన మండలి ఎస్సీ సబ్‌ప్లాన్ ప్రాజెక్టులో ఎంపిక చేసిన 20 మంది రైతులకు విత్తనాలు, కోకోపీట్, వంగనూరు, ఎరువులు ఇతర పరికరాలను ఉచితంగా అందజేశారు. కళాశాల డీన్ డాక్టర్ ఏఎస్ పద్మావతమ్మ ఆన్‌లైన్ ద్వారా పెరటితోటల పెంపకం వాటి ఆవశ్యకతను వివరించారు. పరిశోధన ప్రాజెక్ట్ ప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ సయ్యద్ సదరున్నీషా మాట్లాడుతూ 2022-23 సంవత్సరానికి భారత వ్యవసాయ పరిశోధన మండలి రూ.5.91 లక్షలు అందించిందన్నారు. ఈ నిధులతో కోడూరు, ఓబులవారిపల్లె మండలాల నుంచి 20 మంది రైతులను ఎంపిక చేసి పెరటితోటల ద్వారా పోషణ, ఉద్యోగ భద్రత అనే అంశంపై ప్రాజెక్టులో భాగంగా అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. అనంతరం కర్బూజా, పుచ్చసాగుతో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి కరపత్రాలను పంపిణీ చేశారు. రైతులకు ఎరువులు, ట్రేలు, విత్తనాలు, సూక్ష్మపోషకాలు తదితర ఇన్‌పుట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పి.శ్యామ్‌సుందర్, కె.లలిత, వై.శిరీష, జి.శారద, జయప్రద తదితరులు పాల్గొన్నారు.

గర్భిణీకి రూ.30 వేల ఆర్థిక సాయం


బాధిత కుటుంబానికి నగదు అందిస్తున్న సభ్యులు

చిట్వేలి, ఫిబ్రవరి 21: చలిమంట కాల్చుకుంటూ ప్రమాదవశాత్తు కాలిన బాధితురాలికి కోడూరు వడ్డెర సేవా సంఘం సభ్యులు బుధవారం ఆర్థిక సాయం చేశారు. ఈ మేరకు మండల పరిధిలోని కె.కె.వడ్డిపల్లెలో గల మహాలక్ష్మి అనే గర్భిణీ గత మూడు రోజుల క్రితం చలిమంట కాల్చుకుంటూ ఉండగా ప్రమాదవశాత్తు చీరకు నిప్పంటుకుంది. ఈ ఘటనలో మహాలక్ష్మి వెనుక వైపు కాలి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కోడూరు వడ్డెర సేవా సంఘం సభ్యుల ఆధ్వర్యంలో రూ.30 వేలు ఆర్థిక సాయంతో పాటు మెడికల్ కిట్‌ను అందించారు. కార్యక్రమంలో మదనపల్లి రవి, యామల సిద్దేశ్వర, వల్లి, పి.కిట్టయ్య, బత్తల విజయ్, మల్లెబోయిన కృష్ణ, తమ్మిశెట్టి వెంకటేష్, బత్తల శివకృష్ణ, ఉప్పుతోలు పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం


శిబిరంలో రక్తదానం చేస్తున్న ముక్కా శిరీష


ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 21: టీడీపీ యువనాయకుడు ముక్కా సాయివికాస్ రెడ్డి జన్మదినం సందర్భంగా బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి అభిమానులు, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున హాజరయ్యారు. తిరుపతిలోని రక్షణ రక్తనిధి కేంద్రం ఆధ్వర్యంలో సుమారు 50 మంది అభిమానులు, యువకులు రక్తదానం చేశారు. మొదట యువనాయకుడు వికాస్‌రెడ్డి సతీమణి శిరీష రక్తదానం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో పార్టీ అధినేత చంద్రబాబును సీఎంగా చేయడానికి తనవంతు కృషి చేస్తున్నామన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం


స్వామివారి కల్యాణోత్సవంలో ప్రసాద్‌బాబు దంపతులు

రాయచోటి టౌన్, ఫిబ్రవరి 21: రాయచోటి పట్టణం గాలివీడు రోడ్డు సమీపంలో గల లక్ష్మీపురంలో లక్ష్మీనరసింహ స్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎంపీ సుగవాసి పాలకొండ్రాయుడు తన సొంత నిధులతో ఈ ఆలయాన్ని నిర్మించారు. ఈ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడు, ఆయన కుమారుడు టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్‌బాబుతో పాటు కుటుంబ సభ్యులు పాల్గొని భక్తి శ్రద్ధలతో గణపతిపూజ, కలశపూజ, హోమాలు నిర్వహించి వేదపండితుల వేదమంత్రోచ్ఛారణల మధ్య అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి అభిషేకాలు, అలంకరణ చేసి భక్తులకు దర్శనం భాగ్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో సుగవాసి శ్రీనివాసులు, మన్నేరు రామాంజేయులు, పెరికల రెడ్డెన్న, వాక అన్నమయ్య, మాజీ సర్పంచ్ మల్లికార్జున, కాంట్రాక్టర్ దేవగోపాల్‌నాయుడు, బడిశెట్టి రవి, సాధంశెట్టి సురేంద్ర, కేసీ ప్రసాద్, కళామందిర్ రాజా, గ్రంథే గంగాధర్, మహేశ్, బాలరాజు, శేఖర్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలపై చిన్నచూపు తగదు


ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో కళాశాల బృందం

రైల్వేకోడూరు(రూరల్), ఫిబ్రవరి 21: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివితే మంచి ఉద్యోగాలు వస్తాయో రావో అనే చిన్నచూపు తగదని ప్రిన్సిపాల్ డాక్టర్ వై.నాగరాజు నాయుడు తెలిపారు. బుధవారం కళాశాలలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ఈ నెల 20న చిత్తూరు శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో తమ కళాశాల మూడవ సంవత్సరం విద్యార్థులు 10 మంది హాజరు కాగా, అందరికీ సంవత్సరానికి రూ.2 లక్షలకు పైగా వేతనంతో ఉద్యోగాలు రావడం గర్వకారణమన్నారు. కళాశాలలో వున్న అధునాతన సాంకేతిక విజ్ఞానాన్ని పెంచుకోవడం ద్వారా విద్యార్థులు ఉద్యోగాలు సాధించడం గొప్ప పరిణామమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్.జి.రమేశ్, కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ జి.శివయ్య, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ జి.దయానందం, దాసరి మోషే, పేరెంట్ కమిటీ కన్వీనర్ డి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి: ఎస్ఐ

చిన్నమండెం, ఫిబ్రవరి 21: మండలంలోని టి.చాకిబండ గ్రామ పంచాయతీలో సైబర్ నేరాలపై ప్రజలకు ఎస్ఐ రమేశ్‌బాబు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు లోన్లు వచ్చాయని, ఓటీపీలు చెప్పాలని లేదా మీ బ్యాంక్ అకౌంట్ నెంబర్లు చెప్పాలంటూ ఎరవేసి అకౌంట్‌లోని డబ్బులను కాజేస్తున్నారని, వీటిని దృష్టిలో పెట్టుకొని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రమాదాల నివారణకు ప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు అసైన్డ్ భూములు ఇవ్వాలి

- సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీలు

సిద్దవటం, ఫిబ్రవరి 21: పేదలకు అసైన్డ్ భూములు పంపిణీ చేయాలని ఎంపీటీసీ సభ్యులు డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన సిద్దవటంలోని ఎంపీడీవో కార్యాలయ సభాభవనంలో బుధవారం ఎంపీపీ జ్యోతి వెంకటమ్మ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. మండలంలోని పలు ప్రభుత్వ సమస్యలపై ఎంపీటీసీ సభ్యులు అధికారులను నిలదీశారు. మండలంలో అసైన్‌మెంటు కమిటీ కొన్ని సంవత్సరాలుగా జరగలేదని బొగ్గిడివారిపల్లె ఎంపీటీసీ సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, మాధవరం-1 ఎంపీటీసీ సభ్యులు శివయ్యలు సభ దృష్టికి తీసుకొచ్చారు. మండల కేంద్రానికి 5 కి.మీ. నిబంధనలు పెట్టడంతో అర్హులైన వారు ప్రభుత్వ భూములకు నోచుకోలేదన్నారు. పెన్నానది నుంచి నేకనాపురం, కొమ్మనాయునిపల్లె గ్రామాల ప్రజలు తాగునీరు రాకపోవడంతో వారు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఎంపీటీసీ సభ్యుడు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. పెద్దపల్లి పంచాయతీలోని మలినేని పట్నం కాలనీలో తాగునీరు రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, స్థానికంగా ఉన్న బోరులో రమాదేవి సభ దృష్టికి తీసుకొచ్చారు. మాధవరం-1 పంచాయతీలో ఎండీఎం ఆపరేటర్లు కొందరికి మాత్రమే నిత్యావసర వస్తువులు ఇస్తున్నారని మాధవరం-1 ఎంపీటీసీ సభ్యుడు శివయ్య సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయమై తహశీల్దారు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు మురాషావల్లి, ఎంపీడీవో ఉమామహేశ్వర్‌రావు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని మేనిఫెస్టోలో చేర్చండి

ఒంటిమిట్ట, ఫిబ్రవరి 21: పాత పెన్షన్ విధానాన్ని మేనిఫెస్టోలో చేర్చాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు అన్నారు. బుధవారం టీడీపీ మండల అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డిని ఆయన స్వగృహంలో కలిసి యూటీఎఫ్ ప్రతినిధులతో వినతిపత్రం అందజేశారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ ప్రకటించిన మేనిఫెస్టోలో పాత పెన్షన్ విధానాన్ని అమలు పరిచేలా చూడాలని ఆయన విన్నవించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.





పెద్దపంజాణి మండలం శివాడిలో కనకరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న భువనేశ్వరి - కత్తార్లపల్లెలో శంకరప్ప సతీమణికి చెక్ అందిస్తున్న భువనేశ్వరి - పుంగనూరు మండలం ఎన్ఎస్‌పేటలోని జయమ్మ కుటుంబీకులకు చెక్కు అందజేత

రాష్ట్ర భవిష్యత్తు కోసం టీడీపీని గెలిపించండి

వైసీపీ పాలనలో అన్నీ అరాచకాలే ● ఒంటిమిట్ట రచ్చబండలో నారా భువనేశ్వరి



ఒంటిమిట్ట సభలో మాట్లాడుతున్న నారా భువనేశ్వరి

పుంగనూరు, ఫిబ్రవరి 21: రాష్ట్ర అభివృద్ధి, పిల్లల భవిత కోసం తెలుగుదేశం పార్టీని గెలిపించాలని నారా భువనేశ్వరి పిలుపునిచ్చారు. పుంగనూరు మండలం చంద్రమాకులపల్లె పంచాయతీ ఒంటిమిట్టలో బుధవారం రాత్రి రచ్చబండ వద్ద జరిగిన సభలో ఆమె మాట్లాడారు. ఆరాచకాలు, ఇసుక, మద్యం దోపిడీ దౌర్జన్యాలతోనే వైసీపీ పాలన సాగిందన్నారు. చంద్రబాబుకు సంఘీభావంగా శ్రీకాకుళం జిల్లా నుంచి సైకిల్ యాత్ర నిర్వహించిన టీడీపీ కార్యకర్తలను బట్టలు ఊడదీయించి టీడీపీ జెండాలను తీసి కాళ్లతో తొక్కడం మరిచిపోలేమన్నారు. కడప జిల్లా ప్రొద్దుటూరులో జై జగన్ అనలేదని సుబ్బయ్య అనే టీడీపీ నేతను అన్యాయంగా హింసించారన్నారు. చివరకు జై చంద్రబాబు, జై తెలుగుదేశం అనడంతో అతడిని అతికిరాతకంగా నరికి చంపిన ఘటనను జీవితంలో మరిచిపోలేనన్నారు. అక్రమ కేసులు, హింస, ఇబ్బందులను తట్టుకుని టీడీపీ శ్రేణులు నిలబడటం అభినందనీయమన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో పరిశ్రమలు పెట్టాలంటే అందరూ భయపడుతున్నారన్నారు. ఈ క్రమంలో టీడీపీ గెలుపు ముఖ్యమన్నారు. ప్రతి ఒక్కరూ వందమందిని పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్లి తెలుగుదేశం పార్టీకి ఓట్లు వేయించి గెలిపించాలని కోరారు. టీడీపీ అధికారంలోకి రాగానే అభివృద్ధితో పాటు పరిశ్రమల ఏర్పాటుతో యువతకు ఉపాధి లభిస్తుందని భరోసా ఇచ్చారు. ఈ సభలో టీడీపీ జాతీయప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి అమరనాథరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ అనురాధ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్ రాజు, ఎన్.శ్రీనాథరెడ్డి, అనీషారెడ్డి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సూర్యప్రకాశ్‌నాయుడు, తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు చినబాబు, మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.




చెలిమిగడ్డలో పద్మావతి కుటుంబీకులకు చెక్కు ఇస్తున్న భువనేశ్వరి - ఒంటిమిట్టలో శ్రీనివాసులు చిత్రపటానికి నివాళులు

టీడీపీతోనే మహిళా సాధికారత

కుప్పం/శాంతిపురం, ఫిబ్రవరి 21: టీడీపీతోనే మహిళా సాధికారత సాధ్యమైందని నారా భువనేశ్వరి అన్నారు. ఎన్టీఆర్, చంద్రబాబుతోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో, మళ్లీ టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు విభజిత ఆంధ్రప్రదేశ్‌లో సాధ్యమైందని చెప్పారు. శాంతిపురంలో జరిగిన మహిళల ముఖాముఖిలో ఆమె మాట్లాడారు. 1986లో మహిళలకు ఆస్తిలో సమాన హక్కు చట్టాన్ని ఎన్టీఆర్ కల్పించారని గుర్తు చేశారు మరెన్నో మహిళా సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేశారన్నారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేసి ఆర్థిక స్వావలంబన కలిగించి, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించారని గుర్తు చేశారు. మళ్లీ అధికారంలోకి వస్తే ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, చదువుకున్న ప్రతి ఆడబిడ్డకు ఏడాదికి రూ.15 వేలు ఖాతాల్లో జమ చేస్తారని ఇచ్చిన హామీని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వంలో మహిళలపై అత్యాచారాలు, అరాచకాలు పెచ్చుమీరాయని ఆందోళన వ్యక్తంచేశారు. అక్రమంగా చంద్రబాబు 53 రోజులు జైలులో గడపాల్సి వచ్చినప్పుడు ప్రజలు తమకు ఇచ్చిన మద్దతు, ధైర్యం ఎప్పటికీ మరువలేనని భువనేశ్వరి అన్నారు.

రాష్ట్ర భవిష్యత్తుకోసమే భువనమ్మ ఆరాటం: రాష్ట్ర భవిష్యత్తు, ప్రజల బాగుకోసమే భువనమ్మ కుటుంబం ఆరాటపడుతుందని ఎమ్మెల్సీలు కంచర్ల శ్రీకాంత్, పంచుమర్తి అనూరాధ అన్నారు. కరోనా సమయంలో ఈ ప్రభుత్వం పట్టించుకోకపోయినా ప్రజల కోసం భర్త చంద్రబాబు, కుమారుడు లోకేశ్ ప్రజల్లోకి వెళ్లి సాయం చేస్తుంటే ఆమె భయాన్ని దిగమింగుకుని గడిపారన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించినా కరోనా బాధితులకు ఆక్సిజన్ అందించి ప్రాణాలను కాపాడారని కొనియాడారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్.మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు మాట్లాడుతూ.. కుప్పంలోని అన్ని కుటుంబాల ఆదాయాన్ని రెట్టింపు చేసే ప్రణాళికలు చంద్రబాబు సిద్ధం చేశారన్నారు. ఎన్నికల్లో అధికార పార్టీ ఇచ్చే తాయిలాలకు ప్రభావితం కాకుండా చంద్రబాబును లక్ష మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, మాజీ ఎంపీపీ ఉదయ కుమార్, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు విజయరామిరెడ్డి, మాజీ మంత్రి అమరనాథరెడ్డి, జిల్లా పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు నాని, జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు అరుణ, నియోజకవర్గ అధ్యక్షురాలు అనసూయ, మండల మహిళా అధ్యక్షురాలు శ్యామల తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ అవినీతికి ఇదే సాక్ష్యం!

స్మార్ట్‌సిటీ నిధులతో హోటల్ నిర్మించారంటూ చింతామోహన్ ధర్నా



కాంగ్రెస్ శ్రేణులతో కలిసి నినాదాలు చేస్తున్న చింతా మోహన్

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 21: కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన స్మార్ట్ సిటీ నిధులతో తిరుపతి కపిలతీర్థం వద్ద హోటల్ నిర్మించడం ఏమిటని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్ విమర్శించారు. బుధవారం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి హోటల్ ముందు ధర్నా చేశారు. హోటల్ నిర్వహణను ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వడంలోని ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. తిరుపతి నగరపాలక సంస్థలో అవినీతి రాజ్యమేలుతోందనడానికి ఇదే సాక్ష్యం అన్నారు. కాగా.. తిరుపతి జూపార్కును మరోచోటుకు తరలించి, ఆ ప్రాంతంలో ఐటీ హబ్ నిర్మించాలని కోరారు. నిరుద్యోగ సమస్య శాశ్వత పరిష్కారానికి ఇది మార్గమని చెప్పారు. జర్నలిస్టులు, మీడియా సంస్థలపై దాడులు చేయడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సిటీ అధ్యక్షుడు గోపిగౌడ్, తిరుపతి జిల్లా లీగల్ అధ్యక్షుడు రవి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తేజోవతి, ఓబీసీ జిల్లా అధ్యక్షురాలు శాంతియాదవ్, సేవాదళ్ అధ్యక్షురాలు మునిశోభ, వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.

రాసనపల్లిలో పోలీసుల దాడులు

● డ్రమ్ముల సహా 50లీటర్ల సారా స్వాధీనం
● 1500 లీటర్ల సారా ఊట ధ్వంసం



స్వాధీనం చేసుకున్న డ్రమ్ములు

గుడిపాల, ఫిబ్రవరి 21: గుడిపాల మండలం రాసనపల్లి అటవీ పరిసర ప్రాంతాల్లో బుధవారం ఎస్ఐ రామ్మోహన్ తన సిబ్బందితో దాడులు చేశారు. 1500 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశారు. సారా తయారీకి వినియోగించిన డ్రమ్ములతో పాటు 50 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీ, విక్రేతల గురించి ఆరాతీసి, కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఎన్నిసార్లు వారికి కౌన్సిలింగ్ ఇచ్చినా, కొంతమందిలో మార్పు రావడం లేదన్నారు. వారి కుటుంబాన్ని దృష్టిలో ఉంచుకుని మారితే, ప్రభుత్వం నుంచి తగిన సౌకర్యాలు కల్పిస్తామన్నారు.

ఇనుప మెట్ల ఏర్పాటుపై అభ్యంతరం

శ్రీకాళహస్తి ఫిబ్రవరి 21: ముక్కంటి ఆలయంలో ఇనుపమెట్ల ఏర్పాటు పై అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. ముక్కంటి ఆలయానికి నాలుగు ప్రవేశ ద్వారాలున్నాయి. ప్రతి ద్వారానికి ఒక్కో వైశిష్ట్యాన్ని పురాణాల్లో పేర్కొన్నారు. ఆగమ నియమం ప్రకారం నాలుగు ద్వారాలను గోపురాలు నుంచి రాతి మెట్ల మార్గాలను నిర్మించారు. మూడో ద్వారం తిరుమంజన గోపురం నుంచి భక్తులు రాకపోకలు సాగించేవారు. అయితే ఈ మార్గంలో ఎత్తైన రాతి మెట్లు ఉన్నాయి. వీటిని భక్తులకు అనువుగా మారుస్తున్నామంటూ ఇనుపమెట్లను ఏర్పాటు చేసే పనులకు శ్రీకారం చుట్టారు. ఇది శాస్త్ర విరుద్ధమంటూ సామాజిక మాధ్యమాల్లో భక్తుల నుంచి అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. దీనిపై ఆలయ అధికారులను వివరణ కోరగా... ఇది చాలా విశేషమైన కామ్య మార్గంగా భక్తులు ఆరాధిస్తుంటారని... వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు సైతం ఈ మార్గం నుంచి ఆలయంలోకి వెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు.

సర్వీస్ రోడ్డు లేకుంటే భూముల సాగు ఎలా?

చిత్తూరు- తచ్చూరు హైవేపై రైతుల నిరసన ● పెండింగ్ నష్టపరిహారం ఇప్పించాలంటూ డిమాండు



కాళేపల్లెకు సమీపంలో హైవేపై నిరసన తెలుపుతున్న రైతులు

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 21: 'హైవే కోసం భూములిచ్చాం. మిగిలిన కొంత భూముల్ని సాగు చేసుకోవాలంటే హైవే పక్కన సర్వీసు రోడ్డు లేకుంటే ఎలా?' అని రైతులు ప్రశ్నించారు. చిత్తూరు- తచ్చూరు హైవే పనుల్లో భాగంగా బుధవారం గంగాధర నెల్లూరు మండలం వరత్తూరు పంచాయతీ కాళేపల్లెకు సమీపంలో పలుగ్రామాలకు చెందిన రైతులు టిప్పర్లకు అడ్డంగా నిలబడి నిరసన తెలిపారు. సర్వీస్‌రోడ్డు వేయాలని, రైతులకు పెండింగ్ పడ్డ నష్టపరిహారం విడుదల చేయాలంటూ నినదించారు. హైవే కోసం ఇచ్చిన భూములు పోను కొంతవరకు తమకు మిగిలాయన్నారు. ఆ భూముల్లోకి వెళ్లాలంటే పక్కన 30అడుగుల ఎత్తుతో హైవే ఉండటంతో దారి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. భూములు ఇచ్చేటప్పుడు హైవే పక్కన సర్వీస్‌రోడ్డు ఏర్పాటు చేస్తామా లేదా అనే స్పష్టత ఇవ్వలేదని వాపోయారు. ముసలయ్యగారిపల్లె నుంచి బాలగంగనపల్లె సరిహద్దు వద్ద ఏర్పాటుచేసే టోల్‌గేట్ స్థలం వరకు హైవేరోడ్డుకు ఇరువైపుల భూములున్న రైతుల పరిస్థితి ఇబ్బందిగా మారిందన్నారు. దీనిపై ఎన్నిసార్లు అభ్యంతరాలు చెప్పినా.. హైవేరోడ్డుప్లానింగ్ మ్యాప్‌లో సర్వీస్‌రోడ్డు గురించి మార్కింగ్ తెలియజేయలేదని చెబుతున్నారన్నారు. సర్వీస్‌రోడ్డు లేకుంటే తమ భవిష్యత్తు అగమ్యగోచరంగా మారుతుందన్నారు. దీనికి తోడు వీఆర్వో శివాజి నిర్వాకం వల్ల ఇంకా కొంతమందికి భూమితో పాటు వివిధ రకాల చెట్లు, బావులకు నష్టపరిహారం రాలేదన్నారు. ఈ నష్టపరిహారం వెంటనే విడుదల చేయాలని కోరారు.




టీడీపీ జెండాలు, తోరణాలను దహనం చేసిన ఆనవాళ్లు - రోడ్డు పక్కన పడేశారిలా..

వైసీపీ దాష్టీకం

● టీడీపీ జెండాలు, తోరణాల దహనం

వెదురుకుప్పం, ఫిబ్రవరి 21: 'బాబు ష్యూరిటీ... భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమ నిర్వాహణకు కట్టిన తెలుగుదేశం పార్టీ జెండాలు, పార్టీ తోరణాలను వైసీపీ శ్రేణులు కొందరు పీకేసి దహనం చేశారు. ఈ ఘటన వెదురుకుప్పం మండలం మాంబేడు పంచాయతీ ధర్మాచెరువు గ్రామంలో జరిగింది. బుధవారం సాయంత్రం జరిగే ఈ కార్యక్రమ నిర్వహణకు పంచాయతీ పార్టీ అధ్యక్షుడు మోహన్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి యుగంధర్ ఆధర్యంలో జెండాలు, తోరణాలను ధర్మాచెరువు క్రాస్ రోడ్డు నుంచి ఉదయాన్నే కట్టారు. వైసీపీ శ్రేణులు కొందరు కార్యక్రమ నిర్వహణకు ముందుగా ఆ తోరణాలను, జెండాలను పీకేసి ధర్మాచెరువు విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో రోడ్డుపై దహనం చేశారని తెలుగుదేశం పార్టీ శ్రేణులు తెలిపారు. ఇలాంటి చర్యలకు పాల్పడటం సముచితం కాదన్నారు. ఈ విషయమై పోలీసుల దృష్టికి తీసుకెళ్లినట్లు పార్టీ వర్గాలు చెప్పాయి.




కూలిన వంతెనకు మూడో వార్షికోత్సవం

ఓబీసీ ఫోరం రాష్ట్ర కన్వీనర్ బడి సుధాయాదవ్ వినూత్న నిరసన

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 21: డప్పుల మోత హోరెత్తింది. టపాసులు పేలాయి. భారీ పూలమాలతో ఊరేగింపు తిరుపతి రూరల్ మండలం చిగురువాడ సమీపంలోని కూలిన వంతెన వద్దకు చేరుకుంది. జాతర సంబరాన్ని తలపించిన ఈ దృశ్యం చంద్రగిరి నియోజకవర్గంలో అభివృద్ధి కుప్పకూలిందని చాటిచెప్పేందుకు ఓబీసీ ఫోరం రాష్ట్ర కన్వీనర్ బడి సుధా యాదవ్ నిర్వహించిన వినూత్న నిరసన కార్యక్రమం. కూలిన వంతెనకు పూలమాల వేసి, మూడో వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్టు ఆయన ప్రకటించారు. చంద్రగిరి నియోజకవర్గంలో వానల ధాటికి మూడేళ్ల కింద ఐదు బ్రిడ్జిలు కూలిపోయాయని, వాటి అతీగతీ పట్టించుకునే వారే లేరని సుధాయాదవ్ ఆరోపించారు. తాయిలాలపై తాటికాయంత అక్షరాలతో పేర్లు వేసుకొని పంచేందుకు ఉన్న డబ్బులు, అభివృద్ధి పనులకు మాత్రం ఖర్చు చేయరా? అని నిలదీశారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డిలో చలనం లేనందున, ఆయనకు కనువిప్పు కలగాలనే ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.

రేపటి నుంచి టెన్త్ ప్రీ ఫైనల్ పరీక్షలు

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 21: టెన్త్ ప్రీ ఫైనల్ పరీక్షలు శుక్రవారం నుంచి నిర్వహించనున్నారు. 23న తెలుగు, 24న హిందీ, 26న ఇంగ్లీష్, 27న మ్యాథ్స్, 28న ఫిజికల్ సైన్స్, 29న బయాలజికల్ సైన్స్, మార్చి 1న సోషియల్ స్టడీస్ సబ్జెక్టులకు పరీక్షలు జరగనున్నాయి. ప్రతిరోజూ మధ్యాహ్నం 1.15 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పరీక్షలు ఉంటాయి. వీటితో పాటు సమ్మేటివ్ అసెస్మెంట్ 4 పరీక్షలు నిర్వహించనున్నారు. ఒకటి నుంచి 5వ తరగతి వరకు 23న తెలుగు, మ్యాథ్స్, 24న సైన్స్, ఇంగ్లీష్, 6 నుంచి 8వ తరగతులకు 23న తెలుగు, మ్యాథ్స్, 24న హిందీ, సైన్స్, 26న సోషియల్, 27న పార్ట్-ఏ, పార్ట్-బి ఇంగ్లీష్ పరీక్షలు జరగనున్నాయి. 9వ తరగతి విద్యార్థులకు 23న తెలుగు, మ్యాథ్స్, 24న హిందీ, సైన్స్, 26న సోషియల్, 27న పార్టు-ఏ, పార్టు-బి ఇంగ్లీష్ పరీక్షలు ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో నిర్వహించనున్నారు.

ఐఐటీలో నేడు స్నాతకోత్సవం

ఏర్పేడు, ఫిబ్రవరి 21: ఏర్పేడు వద్ద ఉన్న తిరుపతి ఐఐటీలో గురువారం 4, 5వ స్నాతకోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ తెలిపారు. ముఖ్య అతిథిగా వర్చువల్‌గా ఢిల్లీ నుంచి కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులకు డిగ్రీలను ఐఐటీ డైరెక్టర్ ప్రదానం చేయనున్నారు. ఈ స్నాతకోత్సవానికి హాజరు కావాలని తిరుపతి ఎంపీతోపాటు శ్రీకాళహస్తి, తిరుపతి ఎమ్మెల్యేలకు, కలెక్టర్, ఎస్పీ, మున్సిపల్ కమిషనర్ తదితరులకు ఆహ్వాన పత్రికలను రెండ్రోజుల కిందటే పంపారు. మరో ముఖ్య అతిథిగా జేఎస్‌డబ్ల్యూ ఛైర్మన్ సజ్జన్ జిందాల్ పాల్గొననున్నట్లు డైరెక్టర్ వివరించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.61 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి):తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.61కోట్లు లభించింది.సోమవారం ఉదయంనుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం లెక్కించి బుధవారం ఉదయం ప్రకటించింది. మంగళవారం 62,304 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 20,261 మంది తలనీలాలు సమర్పించారు.

మాతృభాషను పరిరక్షించుకోవాలి

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 21: మాతృభాషను ప్రతి ఒక్కరు పరిరక్షించు కోవాల్సిన బాధ్యత వుందని ప్రిన్సిపాల్ ఆర్.కృష్ణవేణి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మాతృభాష దినోత్సవం సందర్భంగా కవితల పోటీ, పద్యపఠనం, గేయాల పోటీ నిర్వహించి గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. అధ్యాపకులు బషీర్ అహ్మద్, వనజ, హజీరా ఖానమ్, సూర్యశేఖర్, ఖాజా వలి, సుబ్బరాయుడు, వెంకటశివ, విద్యార్థినులు పాల్గొన్నారు.

24న ధర్మపథంలో పౌర్ణమి వేడుకలు

వాల్మీకిపురం, ఫిబ్రవరి 21: వాల్మీకిపురం పట్టణ పడమర పొలిమేరల్లోని ధర్మపథంలో 24న శనివారం పౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించనున్నట్లు అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు పేర్కొన్నారు. ఉదయం సుప్రభాత సేవ, ఆలయంలోని మూలవర్లకు అభిషేకాలు, అర్చన, తోమాల సేవలతో ప్రత్యేక పూజలు, శనేశ్వరస్వామికి రుద్రాభిషేకం, సాయంత్రం అభయాంజనేయ స్వామికి వడమాల, తోమాల సేవలు నిర్వహించనున్నారు.

వినాయకుడి విగ్రహ ప్రతిష్ఠ

మదనపల్లె, ఫిబ్రవరి 21: మదనపల్లె పట్టణం కమ్మవీధి క్రాస్‌లో బుధవారం ఉదయం సర్వసిద్ధి వినాయకస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. జనసేన రాయలసీమ కో-ఆర్డినేటర్ గంగారపు రామ్‌దాస్‌చౌదరి, టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి రాటకొండ మధుబాబు, రాజంపేట పార్లమెంటు కార్యాలయ కార్యదర్శి పూల మురళి, గండికోట గణేష్‌బాబు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు మాకినేని చంద్రశేఖర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పెద్దమండ్యం ఎస్‌ఐగా చెన్నకేశవ



పెద్దమండ్యం, ఫిబ్రవరి 21: పెద్దమండ్యం ఎస్‌ఐగా చెన్నకేశవ బుధవారం బాధ్యతలు చేట్టారు. రాయచోటి నుంచి ఇక్కడికి బది లీపై వచ్చారు. ఇక్కడ ఎస్‌ఐగా పని చేసిన వెంకటేష్ మదనపల్లి తాలుకా పోలీసు స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ చెన్నకేశవ మాట్లాడుతూ గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహ కరిం చాలన్నారు. అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అప రచితుల సంచారం ఉంటే ప్రజలు పోలీసులకు అందజేయాలన్నారు.

రేపు అక్కదేవతల పూజ

గుర్రంకొండ, ఫిబ్రవరి 21: మండలంలోని మర్రిపాడు గ్రామంలో వెలసిన అక్కదేవతల గుడిలో అమ్మవారికి శుక్రవారం పెద్ద పూజా కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెంకటరమణ తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం అక్కదేవతల ఊరేగింపు ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కావాలన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

కలకడ, ఫిబ్రవరి 21: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ వరప్రసాద్ తెలిపారు. పీలేరు సమీపంలోని శివరామాపురం విద్యుత్ లైన్ మరమ్మతులు కారణంగా కలకడ మండలంలోని బాలయ్యగారిపల్లె, కే.దొడ్డిపల్లెతోపాటు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు.

కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా ఇర్ఫాన్

పీలేరు, ఫిబ్రవరి 21: కాంగ్రెస్ పార్టీ పీలేరు మండల మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా పీలేరు పట్టణానికి చెందిన షేక్ ఇర్ఫాన్ నియమితులయ్యారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఆడిటర్ మన్సూర్ అలీ ఖాన్ చేతుల మీదుగా బుధవారం ఇర్ఫాన్ తన నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి మండలంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

గర్భవతులకు పోషకాహారం పంపిణీ

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 21: పట్టణంలోని ధాత్రి ఫౌండేషన్ నిర్వాహకురాలు డాక్టర్ స్వాతి ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని గర్భిణులకు పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మ గర్భంలో శిశువు ఆరోగ్యవంతంగా ఉండాలంటే తల్లి పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలన్నారు. అప్పుడు శిశువుకు ఎలాంటి అనారోగ్య సమస్యలు లేకుండా జన్మిస్తారని తెలిపారు. దీంతో తల్లిబిడ్డకు ప్రమాదకరం లేకుండా ప్రసవం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ధాత్రి ఫౌండేషన్ సభ్యులు, గర్భవతులు పాల్గొన్నారు.

అపెక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గొల్లపూడి

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 21: మదనపల్లె టౌన్ అపెక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గాన్ని బుధవారం ఎంపిక చేశారు. ఇందులో మదనపల్లె టౌన్ అధ్యక్షుడిగా గొల్లపూడి తిరుపతిరావు, ఉపాధ్యక్షుడిగా ఎంఎస్ మునిరత్నం, ప్రధాన కార్యదర్శిగా అప్పినపల్లె భాస్కరాచారి, జాయింట్ సెక్రటరీగా రాజారెడ్డి, ట్రెజరర్‌గా ఆర్‌రామచంద్రరావు, గౌరవ సలహాదారులుగా బి.భాస్కర్‌నాయుడు, కృష్ణమూర్తి, రామచంద్రయ్య, బాలసుబ్రహ్మణ్యం, ప్రహల్లదరెడ్డి, శకుంతలమ్మ, కరుణాకర్‌ను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా సురేష్‌కుమార్‌రెడ్డి, ఆదిరెడ్డి, రెడ్డెప్ప, వెంకటరమణ, జయచంద్రారెడ్డి, జనార్థనరెడ్డి, రవిప్రకాష్, ప్రకాష్, నారాయణరెడ్డి, ఎస్‌రెడ్డెప్పరెడ్డి, రామనాథ్‌రెడ్డి, రాజేశ్వరీ, రహంతుల్లా, రామమూర్తి, అసోసియేషన్ సభ్యులుగా ఎంపికయ్యారు.

కార్మిక, ఉద్యోగుల సమస్యలను విస్మరించిన ప్రభుత్వాలు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 21: కార్మిక, ఉద్యోగుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎన్జీయూ భవన్‌లో నిర్వహించిన మదనపల్లె ఏఐటీయూసీ పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని ప్రభుత్వశాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, పార్ట్‌టైం, డైలీవేజ్ కార్మికులను పర్మినెంట్ చేసి సమానపనికి సమా నవేతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జగన్న గోరుముద్ద పథకంలో పని చేస్తున్న కార్మికుల వేతనాలు పెంచాలని కోరారు. మున్సిపల్, అంగన్వాడీల సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికలను చాలెంజ్‌గా తీసుకుందాం...టీడీపీని గెలిపిద్దాం

● ప్రతి పోలింగ్ బూత్‌లో మెజార్టీ వచ్చేలా కష్టపడి పనిచేయాలి ● తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే జి.శంకర్‌యాదవ్



మాట్లాడుతున్న తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్

ములకలచెరువు, ఫిబ్రవరి 21: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను ఛాలెంజ్‌గా తీసుకుని తంబళ్లపల్లె గడ్డపై టీడీపీ, జనసేన పార్టీల జెండా ఎగరేద్దామని తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి జి.శంకర్‌యాదవ్ పిలుపు నిచ్చారు. మదనపల్లెలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ములకలచెరువు మండల పరిధిలోని 16 గ్రామ పంచాయతీల క్లస్టర్, యూనిట్, పోలింగ్ బూత్ ఇన్‌చార్జిలు, ఏజెంట్లు, గ్రామ కమిటీ నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి పోలింగ్ బూత్‌లో టీడీపీకి మెజారిటీ వచ్చేలా కష్టపడి పనిచేయాలన్నారు. నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరపాలని కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమీషన్‌కు లేఖలు రాశామని తెలిపారు. అరు మండలాల్లోని పోలింగ్ బూత్‌లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి బలగాలను పెంచాలని కోరామన్నారు. ఎన్నికల్లో వైసీపీ అరాచకాలకు పాల్పడే అవకాశం ఉందని ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. రాష్ట్రంలో అరాచక, అవినీతి పాలన సాగించిన వైసీపీకి బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తంబళ్లపల్లెలో ఎన్ని అరాచకాలు చేసినా ధైర్యంగా నిలబడి ఎదుర్కొన్నామన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీలు విజయం సాధించడం ఖాయమన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు ఖచ్చితంగా ఉంటుందన్నారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా, మండల ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, నేతలు చెన్నకిష్టా, కేవీ రమణ, ముత్తుకూరు మౌలా, కేశవులు, జేసీబీ సుధాకర్‌నాయుడు, గుత్తా సుధాకర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

యువత ఓట్లే టీడీపీకి బలం : నల్లారి



ఎస్.కొత్తపల్లెలో టీడీపీ యువతతో నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి

గుర్రంకొండ, ఫిబ్రవరి 21: తెలుగుదేశం పార్టీకి యువత ఓట్లే కీలకమని నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని శెట్టివారిపల్లె పంచాయతీ ఎస్.కొత్తపల్లెలో ఓ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రావాలంటే యువత కష్టపడి పని చేయాలన్నారు. పార్టీ ప్రకటించిన మినీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమలో నాయకులు వెంకటక్రిష్టారెడ్డి, ఆదినారాయణ, రాజు, అశోక్, హరినాథ్, హరి, రామకృష్ణ, చిరంజీవి, హేమంత్, నరేష్, రాజేష్, మహేష్, వెంకటేష్, అంజప్ప తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే ఆంధ్రరాష్ట్ర అభివృద్ధి

వాల్మీకిపురం, ఫిబ్రవరి 21: టీడీపీ జాతీయ అధ్య క్షుడు, మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడుతోనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో ముందుకెళ్తుందని మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం వాల్మీకిపురం పట్టణం, రామ్‌నగర్ తదితర ప్రాంతాలలో పార్టీ నాయకులు, కార్యకర్తలు టీడీపీ, జనసేన మేనిఫెస్టో సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలపై కరపత్రాలు పంచుతూ అవగాహన కల్పించారు. పీలేరు తెలుగు యువత ఉపాధ్యక్షుడు లంకిపల్లి మధు, మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్, టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జీవనశైలి, వ్యాధులపై అవగాహన కల్పించాలి

● డీఎంహెచ్‌వో కొండయ్య



గోరంట్లపల్లెలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో కొండయ్య

పీలేరు, ఫిబ్రవరి 21: జీవనశైలి వ్యాధులైన బీపీ, షుగర్ గురించి గ్రామీణులకు విస్తృత అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో డా.కొండయ్య వైద్య సిబ్బందికి ఆదేశించారు. కేవీపల్లె మండలం గోరంట్లపల్లె పంచాయతీ జంగంపల్లెలో బుధవారం జరిగిన 104 వాహన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్రమత్తత, అవగాహనతోనే ప్రజలు జీవనశైలి వ్యాధుల బారిన పడకుండా ఉంటారని, వ్యాధుల నివారణకు పాటించాల్సిన ఆరోగ్య, భోజన విధానాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. 104 వాహనం ద్వారా అందించాల్సిన వైద్య సేవల్లో ఎలాంటి అలసత్వం ప్రదర్శించరాదని, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. 104 వాహనంలో నిర్వహిస్తున్న ఓపీ రిజిష్టర్, మందుల నిల్వలను పరిశీలించారు. ఆ తరువాత సొరకాయలపేట పంచాయతీ మినిమిరెడ్డిగారిపల్లెలోని ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అక్కడ నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల సెషన్‌ను తనిఖీ చేశారు. టీకాల నిల్వ, లబ్ధిదారుల లిస్టు పరిశీలించారు. అర్హులైన ప్రతి గర్భిణి, శిశువుకూ 100 శాతం టీకాలు అందజేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో చంద్రమైత్రి సుధా, ఆరోగ్య కార్యకర్త రిహానా బేగం, 104 సిబ్బంది ధరణి, రెడ్డిమోహన్, ఆశా కార్యకర్తలు లక్ష్మీదేవి, విజయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వాల్మీకిపురం, ఫిబ్రవరి 21: పట్టణంలోని పట్టాభి రామాలయంలో బుధవారం టీటీడీ ఆధ్వర్యంలో పునర్వసు సీతారాముల కల్యాణోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ మొదలు ఆలయంలోని మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవలతో ప్రత్యేక పూజలు జరిగాయి. నూతన వధూవరులైన సీతారాములకు విశేష అలం కరణలు గావించి మామిడి తోరణాలు, పుష్పాలంకరణలతో ముస్తాబు చేసిన కల్యాణ వేదికపై ఆశీనులు గావించారు. మంగళ వాయిద్యాలు, వేదపండితుల మంత్రో చ్ఛా రణలు, విశేష భక్తజనం నడుమ రాములోరి కళ్యాణం కమనీయంగా సాగింది. చివరగా హోమాదికార్యక్రమాలు, పూర్ణాహుతి గావించి కళ్యాణంలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు, వస్త్రం పంపిణీ చేశారు. సాయంత్రం తిరు చ్చిలో సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాములను పురవీధులలో నగరోత్సవం నిర్వహిం చారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, అర్చకులు కృష్ణరాజు భట్టార్, అనిల్ స్వామి, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

తప్పులను ఎత్తి చూపుతున్నందుకే పత్రికలపై దాడులు

బి.కొత్తకోట, ఫిబ్రవరి 21: ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి ఒక్క అవకాశం అంటూ ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చి తప్పుమీద తప్పులు చేస్తూ, వాటిని ఎత్తి చూపుతున్న ఆంధ్రజ్యోతి, ఈనాడులపై కక్ష కట్టి దాడులు చేయిస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్‌ఎం పర్వీన్‌తాజ్ ఆరోపించారు. బుధవారం బి.కొత్తకోటలో ఆమె మాట్లాడుతూ సీఎం జగన్ తీరు ఆడలేక మద్దెల ఓడు అన్న చందంగా ఉందని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చి ఐదేళ్లు కావస్తున్నా చేసిదేమీ లేక పోగా, ప్రశ్నించిన వారిపై కేసులు బనాయించి భయపెడుతూ వచ్చిన ప్రభుత్వం చివరికి విచక్షణ కోల్పోయి పత్రికా విలేకరులు, కార్యాలయాలపై దాడులు చేసే దుర్మార్గపు ఆలోచనలు చేస్తూ.. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పద్మనాభ, శ్రీనివాసులు, షఫీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

బి.కొత్తకోట, ఫిబ్రవరి 21: మండలంలోని బడికాయలపల్లి రోడ్డులో వలస గుట్టపల్లెకు చెందిన పొడుగు నర్సింహులు(45)అనే వ్యక్తి అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తుండగా బి.కొత్తకోట పోలీసులు దాడి చేసి.. 96 మద్యం పాకెట్లు, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కాగా, సీఐ సూర్యనారాయణ ఆదేశాల మేరకు మండలంలో వివిధ కేసులలోని 19 మంది నిందితులను ఎలాంటి నేరాలు చేయకూడదని తహశీల్దార్ పుణ్యవతి వద్ద బుధవారం బైండోవర్ చేసినట్టు పోలీసులు పేర్కొన్నారు

పాత్రికేయులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

పీలేరు, ఫిబ్రవరి 21: ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, ఈనాడు ప్రాంతీయ కార్యాలయంపై దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని పీలేరు జనసేన నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీలేరులో బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ పాత్రికేయులు, పత్రిక లపై దాడి ప్రజాస్వామ్య ఉనికికే ప్రమాదమని, ప్రజాస్వామ్యంపై నమ్మకంలేని భూస్వామ్య వైసీపీ నాయకులే ఈ దాడులకు కార్యకర్తలను ఉసిగొల్పుతున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై నమ్మకం ఉంటే ప్రభుత్వం వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన ప్రధాన కార్యదర్శి కలప రవి, పీలేరు మండల పార్టీ అధ్యక్షుడు మోహన కృష్ణ, ఉపాధ్యక్షుడు గురుమోహన్, ప్రధాన కార్యదర్శి గజేంద్ర పాల్గొన్నారు.

గ్రామ స్వరాజమే లక్ష్యంగా పని చేద్దాం



రైతులతో మాట్లాడుతున్న సింగం రామకృష్ణారెడ్డి

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 21: గ్రామ స్వరాజమే లక్ష్యంగా పని చేద్దామని రాజంపేట పార్లమెంట్ కాంగ్రెస్ నాయకులు, పుంగనూరు నియోజకవర్గ కన్వీనర్ సింగం రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం రూరల్ మండలంలోని రాగిమాకులపల్లె, నారమాకుల తాండపల్లెల్లో కాంగ్రెస్ పార్టీ ఇంటింటి కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతులు పడే కష్టాలు, విద్యార్థుల విద్యాభ్యాసం, గ్రామీణ ప్రాంతాలకు బస్సు సౌకర్యంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు కష్టాలు పోవాలన్నా, గ్రామీణ ప్రాంతాలు బాగుపడాలన్నా, ప్రజల చీకటి బతుకుల్లో వెలుగు నింపాలన్నా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాల్సిందే అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయ కులు శ్రీదేవి, సైదాని, ఈశ్వర్, రాజారెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

14మంది పేకాట రాయుళ్ల అరెస్ట్

నిమ్మనపల్లి, ఫిబ్రవరి 21: అగ్రహారం పంచాయతీ పూలవాండ్లపల్లి సమీపంలో పేకాట ఆడుతున్న 14 మంది పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్లు సీఐ సదు గురుడు, ఎస్‌ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ కొంత కాలంగా పూలవాండ్లపల్లిలో పేకాట ఆడుతున్నట్లు పక్కా సమాచారం తెలియడంతో దాడి చేసి 14 మందిని అరెస్ట్ చేశామన్నారు. వారి వద్ద నుంచి రూ.22,890లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మంచినీటి సమస్య తీర్చండి సారూ...

● అలంకార ప్రాయంగా తాగునీటి బోరు

● మంచినీటి సమస్యతో అల్లాడుతున్న ప్రజలు

● సొదుం పంచాయతీ కొటార్లగడ్డలో దుస్థితి



కొటార్లగడ్డలో నిరుపయోగంగా మారిన మంచినీటి బోరు

పెద్దతిప్పసముద్రం ఫిబ్రవరి 21 : టి.సదుం పంచాయతీ యర్రబల్లి సమీపంలోని కొటార్లగడ్డలో తాగునీటి పథకం బోరు వేసి ఏడాది గడుస్తున్నా అలంకార ప్రాయంగానే ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామంలో సుమారు 20 కుటుంబాలు నివశిస్తున్నాయి. ఇక్కడ గత రెండు మూడేళ్ల నుంచి తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. దీంతో పంచాయతీ అధికారులు ఏడాది క్రితం తాగునీటి పథకం ద్వారా బోరు అయితే వేశారు. ఆ బోరుకు పైపులైన్ కూడా వేశారు. కానీ విద్యుత్ సర్వీసు మంజూరు కాకపోవడంతో బోరు నిరుపయోగంగా మారి... మంచినీటి సమస్య తీరడం లేదని గ్రామస్తులు గగ్గోలు పెడుతున్నారు. గ్రామానికి మంచినీటి అవసరాల కోసం పక్కనే ఉన్న ఊడగలకుంట చెరువులో గతంలో బోరు వేశారు. ఆ చెరువును కబ్జా చేసి.. కొందరు రైతులు ఆ బోరును నిర్వీర్యం చేయడంతో మంచినీటి సమస్య ఏర్పడిందని ఆ గ్రామస్తులు చెబుతున్నారు. దీంతో గత రెండేళ్ల నుంచి వ్యవసాయ బోర్ల వద్ద నుంచి మంచినీటిని తెచ్చుకుంటున్నామని, వేసవి కాలం సమీపిస్తుండడంతో వ్యవసాయ బోర్ల వద్ద తెచ్చుకునేందుకు రైతులు నిరాకరిస్తున్నారని, దీన్ని దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు ఇప్పటికైనా మంచినీటి సమస్యను తీర్చేందుకు కృషి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రాష్ట్రంలో శాంతిభద్రతలు కరువయ్యాయి



సమావేశంలో మాట్లాడుతున్న మధుబాబు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 21: రాష్ట్రంలో ప్రజలకు శాంతి భద్రతలు కరువయ్యా యని... ఇందుకు ఉదాహరణే టీడీపీ రైతు విభాగం మర్రెడ్డి శ్రీనివాసరెడ్డిపై హత్యాయత్నం అని రాష్ట్ర తెలుగు రైతు విభాగం కార్యదర్శి రాటకొండ మధు బాబు విమర్శించారు. బుధవారం స్థానిక కమ్మవీధిలోని మధుబాబు నివాసంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి రాగానే ప్రజావేదిక విధ్వంసంతో అరాచకాలు ప్రారంభించారని, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బీసీ నాయకులపై దమనకాండ సాగిస్తున్నారన్నారు. వైసీపీ పాలన నీచంగా దిగజారిపోయిందని, మర్రెడ్డి శ్రీనివాసులురెడ్డిపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. టీడీపీ పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ మాట్లాడుతూ సిద్ధం సభల్లో సీఎం జగన్ చొక్కా రెట్టలు మడిచి టీడీపీ నాయకులు, పత్రికలపై దాడులు చేయమని ప్రోత్సహిస్తున్నార్నారు. వైసీపీ నాయకులు బరితెగించి ఆంధ్రజ్యోతి విలేకరి శ్రీకృష్ణపై హత్యాయత్నం, కర్నూలులో ఈనాడు కార్యాలయంపై దాడి చేయడమే నిదర్శమన్నారు. టీడీపీ నాయకులు మురళి, వంటికొండ వెంకటేశ్, గండిగోట గణేష్, మాకినేని చంద్రశేఖర్, రాజన్న, ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.2.50 కోట్ల ఆదాయమే లక్ష్యంగా ప్రణాళికలు

● మార్కెట్ కమిటీ నూతన పాలక వర్గం తీర్మానం



మాట్లాడుతున్న మార్కెట్‌యార్డు చైర్మన్ శ్రీనివాసులురెడ్డి

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 21: మదనపల్లె వ్యవసాయ మార్కెట్ కమిటీ వార్షిక ఆదాయాన్ని రూ.2.50 కోట్ల లక్ష్యంగా చేరుకునేందుకు ప్రణాళికలు రూపొందించామని మార్కెట్ కమిటీ చైర్మన్ తట్టి శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక మార్కెట్‌యార్డులో నూతన పాలకవర్గం సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మార్కెట్‌లో కొంత మంది మండీ యజమానులు రూ.35 లక్షల అద్దె బకాయిలు వున్నారని, వీరికి నోటీసులు ఇచ్చి వసూలు చేస్తామన్నారు. మార్కెట్‌లో 52 స్థలాలను మండీ యజమానులకు అద్దెకు ఇచ్చే విషయమై సభ్యుల ఆమోదం కోరామన్నారు. మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు ఎంఆర్ వెంకటేశ్‌బాబు మాట్లాడుతూ మార్కెట్‌యార్డులో పాడుబడిన భవనాన్ని కూల్చేసి రూ.45 లక్షల షాపింగ్ గదులు నిర్మాణానికి సభ్యులు ఆమోదం తెలిపారన్నారు. రైతుల సమస్యలు పరిష్కరిస్తూ, వారికి అన్ని మౌళిక వసతులు కల్పిస్తామన్నారు. సమావేశంలో మార్కెట్ సెక్రటరీ అభిలాష్, సభ్యులు అపర్ణ, లక్ష్మీదేవి, సుమ, రమణప్ప, జయమ్మ, శంకర్‌నాయక్, రేణుక, రెడ్డెమ, ఆశ, గంగులేరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేద్దాం : జనసేన నేత



బసినికొండలో ప్రచారం చేస్తున్న జనసేన నేతలు

మదనపల్లె, ఫిబ్రవరి 21: వచ్చే ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి తెచ్చే విధంగా పని చేయాలని నియోజకవర్గ జనసేననేత శ్రీరామ రామాంజనేయులు పేర్కొన్నారు. స్థానిక బర్మావీధిలోని పార్టీకార్యాలయంలో బుధవారం రామసముద్రం మండలానికి చెందిన నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా పార్టీని మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆయన సూచించారు. జనసేన, టీడీపీ ఉమ్మడి ప్రభు త్వం రాగానే తాము చేపట్టబోయే అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించా లన్నారు. అనంతరం మండలంలోని గ్రామాల వారీగా పార్టీ పరిస్థితిని సమీక్షించారు. ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి దారం అనిత, దారం హరిప్రసాద్, పట్టణ అధ్యక్షుడు జగదీష్, మండల నాయకులు పాల్గొన్నారు. అనంతరం బసిని కొండ ఏరియాలలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

ఉమ్మడి ప్రభుత్వం రాగానే జిల్లా కేంద్రం : జనసేన, టీడీపీ ఉమ్మడి ప్రభుత్వం రాగానే మదనపల్లెను జిల్లా కేంద్రం చేస్తామని శీరామ రామాంజ నేయులు పేర్కొన్నారు. అన్ని అర్హతలు ఉన్న మదనపల్లెను చేయకపోవడంతో ఇక్కడి రాజకీయపార్టీలు, ప్రజా సంఘాలు, కులసంఘాలు ఆందోళలు చేపట్టారని ఆయన పేర్కొన్నారు. ఇక్కడ ప్రజల మనోభావాలను దెబ్బతిన్న నేపథ్యంలో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌ను దృష్టికి తీసుకెళ్లగా, ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

క్షయవ్యాధిని నిర్లక్ష్యం చేయద్దు



రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్

గుర్రంకొండ, ఫిబ్రవరి 21: క్షయ వ్యాధిని ప్రజలు నిర్లక్ష్యం చేయవద్దని జిల్లా క్షయ వ్యాధి నిజ నిర్ధారణ కమిటీ సభ్యుడు డాక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. మండలంలోని నడిమిఖండ్రిగ గ్రామంలో బుధవారం క్షయ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి మందులు వాడడం వలన నిర్మూలించవచ్చునని తెలిపారు. అలాగే రోగులు మందులను ఆరు నెలల పాటు వాడడంతో పూర్తిగా తగ్గించుకోవచ్చునన్నారు. అనంతరం గ్రామంలో రోగుల వివరాలను సేకరంచి మందులను పంపిణీ చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ రవీంద్ర నాయక్, మోహన్, నాగిరెడ్డి, పవన్‌కుమార్, ఆషారాణి, నిర్మల, సుజాతలు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం



ర్యాలీ నిర్వహిస్తున్న తెలుగు భాషా సమితి సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

పీలేరు, ఫిబ్రవరి 21: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని బుధవారం పీలేరులోని తెలుగు భాషా సమితి సభ్యులు ఘనంగా నిర్వహించారు. మాతృభాషా ఔన్నత్యాన్ని వివరిస్తూ బుధవారం ఉదయం పీలేరు పాత బస్టాండు నుంచి స్థానిక జడ్పీ మెయిన్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీఎస్‌ఆర్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వాల్మీకిపురం విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు ప్రసాద్, విశ్రాంత హెచ్‌ఎం సరస్వతీ శ్రీరాముల రాజు మాతృభాష గొప్పదనం గురించి విద్యార్థులకు వివరించారు. తెలుగు భాష లోని కవులు, రచయితలు, వారి రచనలు, కవితల గురించి తెలియజేశారు. తెలుగుభాషా సమితి అధ్యక్షుడు జలక నూరి మురళీధర్ రాజు, సీఎస్‌ఆర్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ విజయ భాస్కరరెడ్డి, తెలుగు ఉపాధ్యాయులు బాలాంజనేయులు, చంద్రశేఖర్, రాజన్న, మురళీ, అజిత్, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలలో 250 మంది ఉద్యోగాలకు ఎంపిక



క్యాంపస్ ఇంటర్వ్యూలో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 21: మదనపల్లె పట్టణంలోని శ్రీజ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో మూడు రోజులుగా నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో 250 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ బెంగళూరుకు చెందిన టీసీఎస్ కంపెనీ నిర్వహించిన ఇంటర్వ్యూలో 100 మంది ఫైనలియర్ విద్యార్థులు పాల్గొనగా... 20 మంది బిజినెస్ ప్రాసెస్ సర్వీసెస్ ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. వీరికి ఏడాదికి రూ.2.20లక్షల వేతనం ఇస్తారన్నారు. అలాగే బెంగళూరుకు చెందిన అల్టిస్ట్ సంస్థ నిర్వహించిన ఇంటర్వ్యూలో బిజినెస్ ప్రాసెస్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు 214 మంది ఎంపిక కాగా.. వీరికి ఏటా రూ.1.80 లక్షల వేతనం అందిస్తారన్నారు. అమెరికాకు చెందిన 24/7 ఏఐ సంస్థ నిర్వహించిన ఇంటర్వ్యూలో 16 మంది ప్రాసెస్ ఎగ్జిక్యూటివ్‌లు ఉద్యోగానికి ఎంపికయ్యారని.. వీరికి ఏటా రూ.3.20 లక్షల వేతం ఇస్తారన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కరస్పాండెంట్ గురుప్రసాద్, ప్రిన్సిపాల్ రమాదేవి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ మహేష్ అభినందించారు.